నేటి కందం- నేటికి అందం

నేరుగ పలు విషయములను
తీరుగ చిత్రించగలుగు ధిష్ణగల కళా
కారుల దినమును ముదమున
వారిజ నేత్రుని దయ జరుపంగా వలయున్ !!
(అక్టోబరు 25 ప్రపంచ కళాకారుల దినం)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

చురక

ఏ పార్టీ నాయకునికి
ఏ పరువు వెలుగుందని
కోర్టుకెక్కి నిలపుకోను
కొనఊపిరి కలిగుందని
ఎవరెంతా సుద్దపూసో
ఎరుకలేదా జనానికి
ఎవరింకా నమ్ముతారు
ఎగిరిపడితే రణానికి



-వేల్పుల నారాయణ
9440433475

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 25-10-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:66 పేజీలు:6 వెల: రూ.1/-


## సూర్యాపేట అభివృద్ధి కార్యక్రమాలపై గవర్నర్ సమీక్ష

**-ఒక్క రోజు పర్యటనకు సూర్యాపేట వచ్చిన జిష్ణుదేవ్ వర్మ**
**-ఘన స్వాగతం పలికిన మంత్రి ఉత్తమ్**
**-కవులు, కళాకారులతో సమావేశం**

నల్గొండ, అక్టోబర్ 24:సూర్యాపేట జిల్లాలో జరుగుతున్న అభివృద్ధిపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమీక్షించారు. గురువారంజిల్లాలో




ఒక్క రోజు పర్యటనకు వచ్చిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూర్యాపేట కలెక్టరేట్ వద్దకు ఉదయం పదిన్నర గంటలకు చేరుకున్నారు. తొలుత పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్ లో జరిగే కార్యక్రమానికి హాజర య్యారు. ఈ సందర్భంగా జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వివరించారు. అనంతరం జిల్లాలోని వివిధ రంగాల్లోని రచయితలు, కవులు, కళాకారులు, అవార్డు గ్రహీతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కవులు, కళాకారులు, అవార్డు గ్రహీతలు మాట్లాడారు.

సూర్యాపేట చేరుకున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు మంత్రి ఉత్తమ్ కుమార్, అధికారులు ఘన స్వాగతం పలికారు. గవర్నర్ కారుదిగిన వెంటనే రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. అలాగే జిల్లా కలెక్టర్ తేజాస్ నందలాల్ పవార్ తో పాటు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు పుష్ప గుచ్ఛాలు అందజేశారు. సూర్యాపేట జిల్లాలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల ఫోటోలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తిలకించారు. అలాగే అంగన్‌వాడీలు, మహిళ సంఘాలు తయారు చేసిన పౌష్టికాహార పదార్థాల శిబిరాన్ని ఆయన సందర్శించారు.

సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కలెక్టర్ తేజాస్ నందలాల్ పవార్, అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి గురించి తొలుత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. అనంతరం కలెక్టర్ తేజాస్ చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి నివేదిక ఇచ్చారు.

## ఎన్నారై సుష్మితకు సరోజినీ నాయుడు అంతర్జాతీయ అవార్డు..!

న్యూఢిల్లీ, అక్టోబర్ 24: అమెరికాలోని టెక్సాస్‌లో స్థిరపడిన హైదరాబాద్ వాసి సుష్మితకు ప్రతిష్టాత్మక డాక్టర్ సరోజినీ నాయుడు అంతర్జాతీయ అవార్డు లభించింది. వర్కింగ్ ఉమెన్-2024 క్యాటగిరీలో ఆమె ఈ అవార్డును అందుకున్నారు. ఇంటర్నేషనల్ చాంబర్ ఆఫ్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ ఇంటర్నేషనల్ ఉమెన్స్ ఫిల్మ్ ఫోరమ్ సహకారంతో ఏఏఎఫ్‌టీ యూనివర్సిటీ ఈ అవార్డు ప్రధానం చేశారు. తెలంగాణతోపాటు దక్షిణ భారత దేశం నుంచి ఈ అవార్డు సొంతం చేసుకున్న సుష్మిత బుధవారం నొయిడాలో జరిగిన ఓ కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు.

దాతృత్వం, సామాజిక కార్యకర్త, విద్యావేత్త, పర్యావరణ వేత్తగా సుష్మిత ఎంతో గుర్తింపు పొందారు. సమాజంలో కీలక భూమిక పోషించే మహిళా సాధికారతకు ప్రోత్సాహం, బాల కార్మికుల్లో అవగాహన కల్పించడం, బాలల పట్ల వివక్షకు వ్యతిరేకంగా ఆమె అసాధారణ రీతిలో పని చేశారు. ఆమె కరుణ, అంకిత భావంతో తాను పని చేయడం వల్లే ఈ అవార్డు పొందగలిగారు. సుస్థిర ప్రపంచంలో ఇతరులకు భిన్నంగా జీవనం సాగిస్తూ ముందుకెళ్లడం వల్లే సుష్మితకు ఈ అవార్డు లభించింది.

## సింగరేణి కార్మికులు ఫుల్ జోష్ ...దీపావళి బోనస్ నిధులు విడుదల

**-బోనస్ కింద రూ.358 కోట్లు విడుదల**
**-గత ఏడాది కన్నా ఇది రూ. 50 కోట్లు అధికం**
**-ఒక్కొక్క కార్మికునికి రూ.93,750 బోనస్ చెల్లింపు**
**-రేపటి లోగా కార్మికుల ఖాతాల్లో బోనస్ జమ**
**-రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు**

హైదరాబాద్, అక్టోబర్ 24:దీపావళి బోనస్ గా పిలవబడే పి.ఎల్.ఆర్.ఎస్. (ప్రొడక్షన్ లింక్డ్ రివార్డ్ స్కీమ్) బోనస్ ను నేటి నుంచి సింగరేణి కార్మికులకు చెల్లిస్తున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు మరియు ఇంధన శాఖ మంత్రి భట్టి



విక్రమార్క మల్లు గురువారం సచివాలయంలో ప్రకటించారు.

దీని కోసం సింగరేణి సంస్థ 358 కోట్ల రూపాయలను విడుదల చేయాలని సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ ను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సింగరేణిపై సమీక్ష సందర్భంగా ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది చెల్లించిన దీపావళి బోనస్ కన్నా ఇది రూ.50 కోట్లు అధికం కావడం విశేషం. రేపటి మధ్యాహ్నం నాటికి దీపావళి బోనస్ ను కార్మికుల ఖాతాల్లో జమ చేయాల్సిందిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. దీపావళి బోనస్ కింద ఒక్కొక్క కార్మికుడు రూ.93,750 లు అందుకోనున్నారు.

దీపావళి బోనస్ సంస్థలో పనిచేస్తున్న దాదాపు 40,000 మంది కార్మికులకు వర్తిస్తుంది. జే.బీ.సీ.సీ.ఐ. విధానాల్లో భాగంగా కంపెనీలు సాధించిన ఉత్పత్తి పరిమాణం ఆధారంగా కార్మికుల శ్రమకు ప్రోత్సాహకంగా ఈ బోనస్ ను చెల్లించే పద్ధతి గత కొన్నేళ్లుగా అమలులో ఉంటోంది. ఈ ఏడాది కూడా కోల్ ఇండియా స్థాయిలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా దీపావళి పండుగకు ముందే చెల్లింపులు జరిగేలా భట్టి ఆదేశాలిచ్చారు.

**బోనస్ తో కలిపి కార్మికులకు దాదాపు రూ.1250 కోట్ల చెల్లింపులు**

కాగా ఇటీవలే సింగరేణి ఉద్యోగులందరికీ 33 శాతం లాభాల వాటా కింద 796 కోట్ల రూపాయలను కంపెనీ పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఒక్కొక్క కార్మికుడికి సగటున 1 లక్షా 90 వేల రూపాయలు అందాయి. అలాగే ఔట్ సోర్సింగ్ సిబ్బందికి రూ.5 వేల చొప్పున చెల్లించారు. అలాగే పండుగ అడ్వాన్స్ కింద ఒక్కొక్క కార్మికునికి 25వేల రూపాయలు చొప్పున మరో 90 కోట్ల రూపాయలను కంపెనీ చెల్లించింది. ఇప్పుడు దీపావళి బోనస్ కింద ఒక్కొక్కరికి సగటున రూ.93,450లు లభిస్తాయి. మొత్తమ్మీద ఈ నెల రోజుల వ్యవధిలో దీపావళి బోనస్, లాభాల వాటా, పండుగ అడ్వాన్స్ కింద రూ.1250 కోట్ల ను కంపెనీ చెల్లించింది. ఈ విధంగా సగటున సింగరేణి ఉద్యోగులు ఈ నెల రోజుల కాలంలో ఒక్కొక్కరు సుమారు మూడు లక్షల రూపాయల వరకు అందుకున్నారు.రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఆదేశాల పై సింగరేణి సంస్థ సీఎండీ బలరామ్ బోనస్ చెల్లింపుపై తగు ఏర్పాటు చేయాలని ఆయన పర్సనల్ మరియు ఫైనాన్స్ విభాగం అధికారులను ఆదేశించారు. ఈ బోనస్ డబ్బులను దుబారా చేయవద్దని, ప్రభుత్వ పొదుపు సంస్థల్లో దాచుకోవాలని లేదా కుటుంబ అవసరాలకు అనుగుణంగా జాగ్రత్తగా వెచ్చించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## షుగర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

**-వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ**



హైదరాబాద్ అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: దేశ వ్యాప్తంగా షుగర్ వ్యాధి పెరుగుతోంది. వ్యాధులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం మేజర్ వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్ణయం తీసుకుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ తెలిపారు. గురువారం మెదక్‌లో నూతన మెడికల్ కళాశాలలో క్లాసులను ప్రారంభించారు.

మెడికల్ కళాశాల విద్యార్థులకు యూనిఫామ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సామాన్యుడు ఆరోగ్య పరంగా ఇబ్బందులు పడకూడదు.ఇబ్బదులుంటే ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యం అందరికి అందుబాటులో ఉండేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారులు విస్తరించబడ్డాయి. రోడ్డు ప్రమాదాల దృష్ట్యా వైద్యం తొందరగా అందించాలనే సంకల్పంతో తెలంగాణలోని హైవేలపై 74 ట్రామా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఆయన వెంట మంత్రి కొండా సురేఖ, ఎంపీ రఘునందర్‌రావు, ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## కర్నూలు జిల్లాలో పెళ్లింట విషాదం.. రోడు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

అమరావతి, అక్టోబర్ 24: కర్నూలు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. ప్రకాష్‌నగర్ కాలనీకి చెందిన బంగారం వ్యాపారి కామిశెట్టి గురువయ్య తన కూతురు వివాహం ఈనెల 20న ఘనంగా జరిపించారు. తిరుపతి లో ఉండే అల్లుడి ఇంటిలో ఏర్పాటు చేసిన రిసెప్షన్‌కు బుధవారం రాత్రి కారులో బయలు దేరారు.

అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు వద్ద ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్ కారును ఢీ కొనగా కారులో ఉన్న గురువయ్య బంధువులు సుచిత్ర, వాసవి, ప్రేమ్‌కుమార్ మరణించగా మరో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడ్డ క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు.

## హైదరాబాద్ నుంచి మరిన్ని వందేభారత్ రైళ్లు.. కిషన్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 24:హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు మరిన్ని వందే భారత్ రైళ్లు నడపుతామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇప్పటికే హైదరాబాద్ కేంద్రంగా అయిదు వందే భారత్ రైళు నడుస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ ఇవాళ తన చాంబర్ లో తెలంగాణ ఎంపీలతో సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశంలో కిషన్ రెడ్డితో పాటు ఎంపీలు సురేష్ రెడ్డి, కావ్య, డీకే అరుణ, రఘునందన్ రావు లు పాల్గొన్నారు.

సమావేశం అనంతరం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 90శాతం రైల్వేలైన్ల విద్యుద్దీకరణ జరిగిందని తెలిపారు. అమృత్ పథకం కింద పలు రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామన్నారు. వరంగల్లో రూ.650 కోట్లతో రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దక్షిణ మధ్య రైల్వే బడ్జెట్ ను పెంచామన్నారు.




**-ఇప్పటికే నడుస్తున్న అయిదు రైళ్లు**
**-రూ.720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అధునీకీకరణ**
**-వరంగల్ లో రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్**
**-యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ ను పొడిగింపు**
**-రైల్వే జీఎంతో సమావేశం అనంతరం కిషన్ రెడ్డి వెల్లడి**

**రూ.720 కోట్లతో సికింద్రాబాద్ అధునీకీకరణ..**

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ను రూ.720 కోట్లతో అధునికీకరణ చేస్తున్నట్లు వివరించారు కిషన్ రెడ్డి. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ ను పొడిగించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనికి రూ.650 కోట్లు అవసరమని చెప్పారు. ఘట్కేసర్ వరకు ప్రస్తుతం ఎంఎంటీఎస్ సర్వీసు ఉందని.. అక్కడి నుంచి యాదాద్రి వరకు విస్తరించాల్సి ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించకున్నా ఎంఎంటీఎస్ సర్వీసును పొడిగిస్తున్నట్లు వ్యాఖ్యానించారు.

**ఈదులపల్లి స్టేషన్ ను అభివృద్ధి చేయండి..**

ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్ మాట్లాడుతూ.. ఈదుల నాగులపల్లి స్టేషన్ ను అభివృద్ధి చేయాలని రైల్వే జీఎం ను కోరారు. కొల్లూరు, ఈదులు నాగులపల్లి రైల్వే బ్రిడ్జిని అభివృద్ధి చేయాలన్నారు. జర్నలిస్టులు, దివ్యాంగులకు రైల్వే పాస్ లను పునరుద్దరించాలని కోరారు. మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వే లైన్ పూర్తి చేయాలన్నారు.

## వరల్డ్ బ్యాంక్ ప్రెసిడెంట్ అజయ్ బంగాతో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ భేటీ..



న్యూఢిల్లీ, అక్టోబర్ 24: అమెరికా వాషింగ్టన్‌లో ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగాతో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల్లో సంస్కరణల సహా పలు అంశాలపై చర్చించారు. వరల్డ్ బ్యాంక్, ఐఎంఎఫ్ వార్షిక సమావేశాల సందర్భంగా నిర్మలా సీతారామన్, అజయ్ బంగా ప్రపంచ పబ్లిక్ గూడ్స్ ప్రైవేట్ క్యాపిటల్ భాగస్వామ్యం, ఇంధన భద్రత, బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల సంస్కరణలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ప్రపంచ బ్యాంక్ తరపున భారతదేశం జీ-20 ప్రెసిడెన్సీ సమయంలో బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల సంస్కరణలపై ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ గ్రూప్ సిఫారసులపై సాధించిన పురోగతి కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాన్నారు. భవిష్యత్తులో సిఫార్సుల అమలును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని కోరారు.

2023 జీ-20 భారత్ ప్రెసిడెన్సీ ఆధ్వర్యంలో నియమించిన ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ గ్రూప్.. బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల సంస్కరణ కోసం సిఫారసులు చేసింది. పేదరికాన్ని అంతం చేయడం, భాగస్వామ్య శ్రేయస్సును ప్రోత్సహించడం, 2030 నాటికి ప్రపంచ ప్రజా వస్తువుల కోసం స్థిరమైన రుణస్థాయిలను మూడురెట్లు పెంచేందుకు దోహదం చేయాలని.. బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల ఎజెండాలోని అంశాలకు మద్దతు ఇచ్చేందుకు ఇష్టపడే పెట్టుబడిదారులతో ఉద్దేశపూర్వకంగా పాల్గొనేందుకు అనువైన, వినూత్నమైన ఏర్పాట్లను అనుమతించే మూడో ఫైనాన్సింగ్ మెకానిజం రూపొందించాలని సిఫారసు చేసింది. బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ 80వ వార్షికోత్సవం సందర్భంగా చర్చించేందుకు ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్ సంయుక్తంగా నిర్వహించే కన్సల్టేటివ్ మెకానిజంపై విస్తృత సంప్రదింపుల ప్రక్రియ అవసరమని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

## వ్యాక్సిన్ కోసం వచ్చిన తల్లీబిడ్డలు అదృశ్యం

హైదరాబాద్, అక్టోబర్ 24: హాస్పిటల్‌లో కుమార్తెకు వ్యాక్సిన వేయించేందుకు వచ్చిన వివాహిత తన కుమార్తెతో కలిసి అదృశ్యమైనసంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్‌కు చెందిన కాజా ఇలియాజ్ అహ్మద్ అనే వ్యక్తి ఈనెల 21న సోదరి నిషా ఫిర్‌దౌస్‌తో కలిసి ఆమె నాలుగేళ్ల కుమార్తెకు వ్యాక్సిన్ వేయించేందుకు బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. సోదరి నిషా ఫిర్‌దౌస్‌ను, ఆమె కుమార్తెను గేటు వద్ద దింపిన ఇలియాజ్ కారు పార్కింగ్ చేసేందుకు సెల్లార్‌లోకి వెళ్లాడు.

## ఐఐటీ ఢిల్లీ విద్యార్థి ఆత్మహత్య.. మానసిక చికిత్స పొందుతున్నట్లు పోలీసులు వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 24: ప్రతిష్టాత్మక విద్యా సంస్థ అయిన ఐఐటీ ఢిల్లీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. క్యాంపస్‌లోని హాస్టల్ రూమ్‌లో ఉరి వేసుకుని మరణించాడు. అయితే ఆ విద్యార్థి మానసిక ఆరోగ్యం కోసం చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు. జార్ఖండ్‌లోని డియోగఢ్‌కు చెందిన 21 ఏళ్ల కుమార్ యాష్, ఐఐటీ ఢిల్లీలో ఎంఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం రాత్రి హాస్టల్ గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్నేహితుడు, అక్కడి సిబ్బంది కిటికీని పగులగొట్టి గదిలోకి వెళ్లారు. రెండు టవల్స్‌తో ఉరి వేసుకున్న కుమార్‌ను కిందకు దించారు. వెంటనే సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌కు తరలించగా ఆ విద్యార్థి అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు.

మరోవైపు ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఐఐటీ ఢిల్లీ క్యాంపస్‌కు చేరుకున్నారు. స్టూడెంట్ కుమార్ ఆత్మహత్య చేసుకున్న గదిని పరిశీలించారు. అక్కడ ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని పోలీస్ అధికారి తెలిపారు. అయితే మానసిక ఆరోగ్యం కోసం చికిత్స పొందుతున్న మెడికల్ కార్డు ఆ రూమ్‌లో ఉన్నట్లు చెప్పారు.

## పత్తి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించండి : ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 24: రాష్ట్రంలో పత్తి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని.. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి కోరారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను జగదీశ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పత్తి రైతుల సమస్యలపై రిప్రజెంటేషన్ అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో పత్తి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. పత్తి రైతుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. వరదలకు గురైన పత్తి రైతులను ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని.. ఎక్కడ కూడా వారికి ఒక రూపాయి సాయం చేసినట్లు గానీ.. వారి నష్టాన్ని కూడా అంచనా వేసే ప్రయత్నం కూడా చేయలేదన్నారు. అదే సమయంలో పత్తికి సంబంధించి మన రాష్ట్రం పట్ల కేంద్రం కూడా వివక్ష చూపిస్తుందన్నారు. వాస్తవానికి గుజరాత్ రాష్ట్రం పండించే పత్తి కంటే తెలంగాణ రాష్ట్రం రైతాంగం పండించే పత్తి మంచిదని, నాణ్యమైందని అనేక



సందర్భాల్లో (సిసిఐ) కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రశంసించిందిన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

గుజరాత్ రాష్ట్రంలో మాదిరిగా తెలంగాణ రైతాంగానికి రూ. 8257 మద్దతు ధరను ఇప్పించాలని కోరారు. అలాగే తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న రూ. 475 బోనస్‌ను కూడా ఇప్పించాలని డిమాండ్ చేశారు. వరుసగా అకాల వర్షాలతో పత్తి తడిసిపోయి దెబ్బతిన్నదని.. రావలసిన దిగుబడి కూడా అందలేదని.. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం అంచనా ప్రకారం ఎకరానికి 10 నుంచి 12 క్వింటాలు వరకు రావాల్సిన పత్తి ఈ ఏడాది అకాల వర్షాలతో నాలుగు క్వింటాలు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు.

అందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ రైతాంగానికి నష్టపరిహారాన్ని కట్టించాలని.. దానిపైన ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. అదేవిధంగా ఇప్పటివరకు సిసిఐకి సంబంధించిన కేంద్రాలను ఎక్కడ కూడా ప్రారంభించలేదని.. అక్కడక్కడ ఒకటి రెండు కేంద్రాలు తెరిచినప్పటికీ వచ్చిన పత్తిలో తేమశాతం ఎక్కువగా ఉందని.. ఆ వంకతో పత్తిని తీసుకోవడానికి నిరాకరిస్తున్నారన్నారు. దీంతో రైతులు తమ పత్తిని దళారులకు క్వింటాను రూ. 5 వేలకు అమ్ముకుని దోపిడీకి గురవుతున్నారన్నారు.

# వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి పేద రైతుల సాధికారత కోసం కృషి చేసిన త్రిభువన్ దాస్

న్యూఢిల్లీ, అక్టోబర్ 24: గుజరాత్ లోని ఆనంద్ లో శ్రీ త్రిభువన్ దాస్ పటేల్ జయంతిని, జాతీయ పాడిపరిశ్రమ అభివృద్ధి బోర్డు (ఎన్డిడిబి) వజ్రోత్సవాలను పురస్కరించుకుని కేంద్ర హోం , సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా ఈ రోజు రూ. 300 కోట్ల విలువైన పలు రైతు సంక్షేమ పథకాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పంచాయతీరాజ్, మత్స్య, పశు సంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీ అమిత్ షా మాట్లాడుతూ, ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ నాయకత్వంలో ఇటీవల ప్రారంభించిన శ్వేత విప్లవం 2.0 కోసం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపి) విడుదలయ్యాయని, ఇందులో ప్రధానమంత్రి పేర్కొన్న అన్ని రైతు-హిత అంశాలు చేర్చారని పేర్కొన్నారు. సహకార రంగం లక్ష కొత్త, ప్రస్తుత డెయిరీలకు సాధికారత కల్పిస్తుందని, రెండో శ్వేత విప్లవం పాల ఉత్పత్తి, సరఫరా మార్గాలను విస్తరిస్తుందని ఆయన పేర్కొన్నారు.

కష్టపడి పనిచేసే శ్రీ త్రిభువన్ దాస్ జీవితాన్ని వర్ణించడం అసాధ్యమని, తన వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి, దేశంలోని పేద రైతుల సాధికారత కోసం ఒక ప్రత్యేక దార్శనికతతో ఆయన పనిచేశారని శ్రీ అమిత్ షా అన్నారు. ఆయన తన జీవితాంతం నిస్వార్థంగా దేశంలోని పేద రైతుల సాధికారత కోసం పని చేశారని, వ్యక్తిగత లాభాలను పక్కనపెట్టి, ప్రతి రైతును నిజమైన సహకార స్ఫూర్తితో అనుసంధానించడానికి తన ప్రయత్నాలను అంకితం చేశారని, ఈ ప్రయత్నంలో గొప్ప విజయాన్ని సాధించారని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. త్రిభువన్ దాస్ కారణంగానే దేశంలోని ఐదుకోట్లమంది పశువుల పెంపకందారులు ప్రశాంతంగా నిద్రపోతున్నారని, నేడు దేశంలో కోట్లాది మంది రైతులు, ముఖ్యంగా మహిళలు సుభిక్షంగా ఉన్నారని శ్రీ అమిత్ షా అన్నారు. త్రిభువన్ దాస్ స్థాపించిన ఒక చిన్న సహకార సంఘం నేడు దేశంలోని రెండుకోట్లమంది రైతులను సహకార రంగంతో అనుసంధానించడం ద్వారా వేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తోందని అన్నారు.

1964లో, మాజీ ప్రధాన మంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి అమూల్ డెయిరీని సందర్శించి, ఈ విజయవంతమైన మోడల్ ద్వారా గుజరాత్ మాత్రమే కాకుండా, దేశవ్యాప్తంగా ఉన్న పశుసంవర్ధకులు లాభపడాలని నిర్ణయించారని కేంద్ర సహకార శాఖ మంత్రి గుర్తు చేశారు. ఆ దరిమిలా శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి ఎన్డిడిబిని స్థాపించాలని నిర్ణయించారని చెప్పారు. 60 ఏళ్లలో ఎన్డిడిబి దేశవ్యాప్తంగా సహకార రంగానికి, రైతులకు, తల్లులకు, సోదరీమణులకు సాధికారత కల్పించడమే కాకుండా, వారి హక్కులపై అవగాహన పెంచేందుకు కృషి చేసిందని చెప్పారు. సహకార సంఘాల ద్వారా పశుపోషణ చేస్తే రైతులకు సౌభాగ్యం కలగడమే కాకుండా పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లల సమస్య కూడా పరిష్కారమవుతుందన్నారు. అమూల్ ద్వారా నిర్మించిన ట్రస్ట్ మహిళలకు సాధికారత కల్పించడమే కాకుండా పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా బలమైన పౌరులను సృష్టించడానికి పునాది వేసింది.

ఎన్డిడిబి గ్రామీణ రంగంతో పాటు, దేశాభివృద్ధిని కూడా వేగవంతం చేసిందని, అలాగే వ్యవసాయాన్ని స్వావలంబనగా మార్చిందని శ్రీ అమిత్ షా అన్నారు. శ్రీ త్రిభువన్ ఎన్డిడిబికి పునాది వేశారని, ఇది నేడు దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే చాలా పెద్ద సంస్థగా మారిందని ఆయన అన్నారు. 1987 లో ఎన్డిడిబి ఒక అధికారిక సంస్థగా మారిందని, 1970 నుండి 1996 వరకు, ఇది ఆపరేషన్ ఫ్లడ్ కార్యక్రమాన్ని అభివృద్ధి చేసి అమలు చేసిందని, ఇది శ్వేత విప్లవానికి దారితీసిందని ఆయన అన్నారు. అమూల్ నేడు రూ. 60,000 కోట్ల వార్షిక వ్యాపారాన్ని నిర్వహిస్తోందని, ఇది మొదట్లో మహిళల నుండి చాలా తక్కువ భాగస్వామ్య పెట్టుబడితో మొదలైందని ఆయన పేర్కొన్నారు. 1964లో లాల్ బహదూర్ శాస్త్రి ఎన్డిడిబిని స్థాపించాలని నిర్ణయించినప్పుడు అది ఒక రోజు పెద్ద మర్రిచెట్టుగా పెరిగే చిన్న విత్తనమని ఎవరికీ తెలియదని అన్నారు. ఎన్డిడిబి ద్రవ పాల (లిక్విడ్ మిల్క్) అమ్మకాలు రోజుకు 427 లక్షల లీటర్లకు చేరుకోగా, సేకరణ రోజుకు 589 లక్షల లీటర్లకు చేరింది. ఆదాయం రూ. 344 కోట్ల నుంచి రూ. 426 కోట్లకు పెరిగింది. నికర లాభం రూ. 50 కోట్లుగా ఉంది.

ఎన్డిడిబి కూరగాయల ప్రాసెసింగ్ ను ప్రారంభించిందని, దీనితో మన రైతులు పండించిన కూరగాయలు మొత్తం ప్రపంచానికి చేరడానికి వీలు అయిందని, సహకార నమూనా కింద లాభాలను అట్టడుగు వర్గాలకు పంపిణీ చేస్తామని శ్రీ అమిత్ షా చెప్పారు. గోబర్ధన్ పథకం మన భూముల సంరక్షణ, మెరుగుదలకు, పంటల దిగుబడులు పెరగడానికి, రైతుల ఆదాయం పెంపునకు, శుభ్రమైన పరిసరాల సృష్టికి దోహదపడిందని తెలిపారు. ఆవు పేడ నుంచి గ్యాస్, ఎరువులు ఉత్పత్తి అవుతున్నాయని, కార్బన్ క్రెడిట్ రూపంలో చెల్లింపులు మన తల్లులు, సోదరీమణులకు చేరుతున్నాయని అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నిర్ణయాల ద్వారా గోబర్ధన్ పథకాన్ని క్షేత్ర స్థాయిలో అమలు చేశారని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. ఎన్డిడిబి 10,000 రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ - ఎఫ్ పిఒ)లను రిజిస్టర్ చేసిందని తెలిపారు.

ఎన్డిడిబి ఏర్పాటు తరువాత, పాడి పరిశ్రమలోని అన్ని ప్లాంట్లు ఇప్పుడు మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం కింద భారతదేశంలో ఏర్పాటు అవుతాయని శ్రీ అమిత్ షా తెలిపారు. రూ. 210 కోట్లతో మదర్ డెయిరీ ఫ్రూట్ అండ్ వెజిటబుల్ ప్రాసెసింగ్ యూనిట్ కు నేడు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఇంకా, ఉత్తరాఖండ్ కు చెందిన బద్రి నెయ్యి, మదర్ డెయిరీకి చెందిన గిర్ నెయ్యి బ్రాండ్ ను కూడా ఈ రోజు ప్రారంభించారు. సహకార ఉత్పత్తులకు బ్రాండింగ్ చేయడం, కార్పొరేట్ వస్తువులతో మార్కెట్లో పోటీ పడేలా సిద్ధం చేయడం విజయానికి కీలకమని ఆయన అన్నారు. నేడు, మన అమూల్ బ్రాండ్ ప్రపంచవ్యాప్తంగా అగ్రస్థానంలో ఉంది, ఇది మనకు గణనీయమైన విజయం. లద్దాఖ్ నుంచి నేరేడు పండ్లు, హిమాచల్ నుంచి ఆపిల్ పండ్లు, మేఘాలయ నుంచి పైనాపిల్స్ రైతులు ఈ రోజు ప్రారంభించిన కార్యక్రమాల ద్వారా ప్రయోజనం పొందుతారని ఆయన పేర్కొన్నారు.

సహకార మంత్రిత్వ శాఖ కొత్తగా మూడు జాతీయ స్థాయి సహకార సంస్థలను ఏర్పాటు చేసిందని కేంద్ర సహకార శాఖ మంత్రి తెలిపారు. ప్రభుత్వ నాయకత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటేనే ఇలాంటి కొత్త కార్యక్రమాలు చేపట్టగలమని అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ సహకార రంగంలో అనేక కార్యక్రమాలను, పథకాలను అమలు చేశారని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ రంగంలో 22 రాష్ట్ర సమాఖ్యలు, 231 జిల్లా సమాఖ్యలతో పాటు 28 మార్కెటింగ్ డెయిరీలు, 21 పాల ఉత్పత్తి సంస్థలు పనిచేస్తున్నాయి.

మోదీ ప్రభుత్వం కొత్తగా రెండు లక్షల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను (పీఏసీఎస్) ఏర్పాటు చేయబోతోందని, ఇది మన సహకార వ్యవస్థను గణనీయంగా బలోపేతం చేస్తుందని శ్రీ అమిత్ షా అన్నారు. ఈ ప్రయత్నం సహకార రంగంలోని అన్ని సంస్థల బలాన్ని పెంచుతుందని ఆయన అన్నారు. 231 మిలియన్ టన్నుల పాల ఉత్పత్తితో అమెరికాను భారత్ అధిగమించి ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. మన పాల ఉత్పత్తి వృద్ధి రేటు 6 శాతం కాగా, ప్రపంచ వృద్ధి రేటు కేవలం 2 శాతం మాత్రమే. నేడు 8 కోట్ల గ్రామీణ కుటుంబాలు రోజూ పాలను ఉత్పత్తి చేస్తుంటే కేవలం కోటిన్నర కుటుంబాలు మాత్రమే సహకార రంగంతో అనుసంధానమై ఉన్నాయి. అంటే మిగిలిన 6.5 కోట్ల కుటుంబాలు న్యాయమైన ధరలను పొందడం లేదని, దోపిడీకి గురవుతున్నారని అన్నారు. భవిష్యత్తులో పాల ఉత్పత్తిలో ఉన్న మొత్తం 8 కోట్ల రైతు కుటుంబాలు తమ కష్టానికి పూర్తిగా పరిహారం పొందేలా చేసి, వారు సహకార రంగంతో అనుసంధానమయ్యేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర సహకార మంత్రి స్పష్టం చేశారు.

సహకార సంఘాలను సాధికారం చేసే ప్రచారం ఫలితంగా, దేశంలో పాల లభ్యత 1970 లో ఒక వ్యక్తికి 40 కిలోలు, 2011 లో 103 కిలోలకు పెరిగిందని, 2023 లో ప్రతి వ్యక్తికి 167 కిలోలకు పెరిగిందని శ్రీ అమిత్ షా తెలిపారు. సగటు ప్రపంచ పాల లభ్యత ప్రతి వ్యక్తికి 117 కిలో గ్రాములుగా ఉందని తెలిపారు.

# తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలపై జగన్ పిటీషన్

అమరావతి అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వాటాల పంపకాల వివాదంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ తన తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలపై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ లో పిటిషన్ దాఖలు చేశారు. సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, వైఎస్.షర్మిల, వైఎస్ విజయమ్మ, చాగరి జనార్ధన్ రెడ్డి, కేతిరెడ్డి యశ్వంత్ రెడ్డి, రీజినల్ డైరెక్టర్ ఆగ్నేయ ప్రాంతం, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, తెలంగాణను ప్రతివాదులుగా చేర్చారు. తాము కంపెనీ అభివృద్ధి కోసం కృషి చేశామని, 2019 ఆగస్టు 21న చేసుకున్న అవగాహన పత్రం ప్రకారం విజయమ్మ, షర్మిలకు షేర్లు కేటాయించామని, కానీ వివిధ కారణాలతో కేటాయింపు జరగలేదని పిటిషన్ లో పేర్కొన్నారు. ఇప్పుడు ఆ కంపెనీకి సంబంధించిన షేర్లను ఉపసంహరించుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు పిటిషన్ లో పేర్కొన్నారు. షర్మిల ఇటీవల రాజకీయంగా తనకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కారణంగా ఆ ఆఫర్ ను వెనక్కి తీసుకుంటున్నట్లు జగన్ తన పిటిషన్ లో పేర్కొన్నారు. తన తల్లికి, చెల్లికి వాటాలు ఇవ్వదలచుకోలేదని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ కు తెలిపారు. కాగా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నవంబర్ 8వ తేదీకి వాయిదా వేసింది. ఇప్పుడు ఈ తతంగం అంతా చర్చనీయాంశం అయింది.

# శుక్రవారం ఒడిశా తీరాన్ని తాకనున్న 'దానా' తుఫాను :ఐఎండి

హైదరాబాద్ అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: దానా తుఫాను వస్తున్నందున ఒడిశా, పశ్చిమ బెంగాల్ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. లోతట్టు ప్రాంతాల నుంచి నివాసితులను ఖాళీ చేయించడం, విద్యా సంస్థలను మూసేయడం చేస్తున్నారు. రెండు రాష్ట్రాలలోనూ భారీ వర్షాలు కురుస్తున్నందున ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా త్వరగా స్పందించేందుకు భారత తీర రక్షక దళం సన్నద్ధంగా ఉంది. నౌకలు, విమానాలను సిద్ధంగా ఉంచింది. పూరీ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు తూర్పు తీరంపై తుపాను ప్రభావం ఉండనుందని భారత వాతావరణ శాఖ(ఐఎండి) డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. దానా తుఫాను అక్టోబరు 25 తెల్లవారుజామున పూరీ , సాగర్ ద్వీపం మధ్య తీరం దాటుతుందని అంచనా. గాలులు గంటకు 100-110 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉంది, ఈదురు గాలులు గంటకు 120 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది.

# వరద ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్ చేతన్, ఎమ్మెల్యే పరిటాల సునీత

-కనగానపల్లి చెరువుతో సహా తొమ్మిది చెరువులకు గండి

-భారీగా పంట నష్టం

-నెలలోపు పూర్తిస్థాయి మరమ్మతులు

-నివేదికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం

అమరావతి, అక్టోబర్ 23:శ్రీ సత్యసాయి బ్యూరో, అక్టోబర్ 24 (ఆంధ్రప్రభ): శ్రీ సత్యసాయి జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా తొమ్మిది చెరువులకు గండి




పడినట్లు జిల్లా కలెక్టర్ టి ఎస్ చేతన్ తెలిపారు. గురువారం కలెక్టర్ చేతన్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి కనగానపల్లి రెడ్డి వారి కుంట చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ? జిల్లాలో ఈ నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలోని అనేక ప్రాంతాలలో చెరువులకు గండి పడి నీరు వృథాగా పోవడమే కాకుండా, పంటలు నష్టం కూడా భారీగా జరిగిందన్నారు. వాస్తవానికి రెడ్డి వారి కుంట చెరువు సామర్థ్యం 27 వేల క్యూసెక్కులు మాత్రమే ఉండగా, భారీ వర్షం కారణంగా సుమారు 30వేల క్యూసెక్కుల పైబడి నీరు రావడంతో చెరువు కట్ట కోతకు గురైంది. ఫలితంగా గండిపడి నీరంతా దిగువ ప్రాంతానికి వెళ్ళింది. ముఖ్యంగా అనంతపురం సమీపంలోని పండమేరు ద్వారా అనంతపురం శివారు ప్రాంతాన్ని ముంచిన విషయం తెలిసిందే.

అయితే మొత్తం నీరు పండమేరుకు వెళ్లకుండా మధ్యలో డైవర్ట్ కావడం వలన ప్రమాదం చాలా వరకు తగ్గిందన్నారు. ఇదిలా ఉండగా నెలలోపు చెరువుల మరమ్మతులను చేపట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో అవసరమైన నిధుల కోసం నివేదికలు తయారు చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇదే సందర్భంలో వ్యవసాయ శాఖకు సంబంధించిన నష్టం, రోడ్ల మరమ్మతులకు నివేదికలు తయారు చేయాలని ఆదేశించామన్నారు.

# రేవంత్ రెడ్డి దృష్టిలో డబుల్ ఇంజిన్ అంటే మోదీ, అదానీ

-అందుకే వాళ్లిద్దరికీ కావాల్సిన పనులను చక్కబెడుతున్నారు

-బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: రేవంత్ రెడ్డి దృష్టిలో డబుల్ ఇంజిన్ అంటే మోదీ, అదానీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అందుకే వాళ్లిద్దరికీ కావాల్సిన పనులను చక్కబెడుతూ వారి చల్లని చూపు తనపై ఉండేలా చూసుకుంటున్నారని ఫైరయ్యారు. ప్రధాని ఆదేశానుసారమే రేవంత్ నడుచుకుంటున్నారని చెప్పారు. బడేభాయ్ ఆజ్ఞలను సీఎం తూచా తప్పకుండా పాటిస్తున్నారని, అదాని సంతృప్తి కోసం ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారంటూ దుయ్యబట్టారు. అదానికి మేలు చేసేలా రేవంత్ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటున్నదని మండిపడ్డారు. అందుకే సీఎం చేసే దుర్మార్గాలపై బీజేపీ మౌనంగా ఉంటుందంటూ ఎక్స్ వేదికగా ఫైరయ్యారు. 'రేవంత్ రెడ్డి దృష్టిలో డబుల్ ఇంజన్ అంటే = మోదీ + అదానీ. అందుకే వాళ్లిద్దరికీ కావాల్సిన పనులను చక్కబెడుతూ వారి చల్లని చూపు తనపై ఉండేలా చూసుకుంటున్నారు. మూసీ పుట్టిన ప్రాంతం దామగుండం వద్ద 12 లక్షల చెట్లను నరికేందుకు చర్యలు తీసుకున్నారు. 2900 ఎకరాల అటవీ భూమిని మోదీ ఆదేశాలనుసారం ఆయనకు అప్పగించారు. మూసీ పుట్టే ప్రాంతం నాశనమైనా సరే తన బడేభాయ్ ఆజ్ఞను మాత్రం పాటిస్తున్నారు. ఇటు మూసీ దిగువన రామన్నపేటలో అంబుజా సిమెంట్ ప్లాంట్ కోసం బూటకపు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం ద్వారా అదానిని సంతృప్తి పరుస్తున్నారు. నిజానికి ఈ భూమిని తెలంగాణలో డ్రై పోర్ట్ కోసం కేటాయించటం జరిగింది. కానీ మోదీ, అదానీ కోసం ఈ ప్రభుత్వం ఇష్టానుసారంగా అక్కడ సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం పనిచేస్తున్నది. దీనికి ప్రతిఫలంగా రూ. లక్షా 50 వేల కోట్లతో మూసీ ప్రాజెక్ట్ సహా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసే అన్ని దుర్మార్గాలు, అవినీతిపై బీజేపీ మౌనంగా ఉంటుంది' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# ఢిల్లీ కాలుష్యంపై మండిపడ్డ సుప్రీంకోర్టు

న్యూ ఢిల్లీ అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్); ఢిల్లీ కాలుష్యంపై కేంద్రంతో పాటు పంజాబ్, హర్యానా ప్రభుత్వాలపై సుప్రీంకోర్టు మండిపడింది. పొరుగు రాష్ట్రాల్లో చెత్తను తగులబెడుతుండడంతో ఢిల్లీలో ఏర్పడే కాలుష్యాన్ని అరికట్టేందుకు కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. సవరణలతో పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని కోరల్లేని దానిగా మార్చారంటూ ఘాటుగా స్పందించింది. కాలుష్యాన్ని అరికట్టేందుకు కేంద్రం శిక్షాస్పదమైన చర్యలు చేపట్టడం లేదని.. కేవలం నామమాత్రపు జరిమానాలతో సరిపెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం తరపున విచారణకు హాజరైన సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపించారు. పది రోజుల్లో నిబంధనలు ఖరారు చేస్తామన్నారు. చట్టం పూర్తిగా అమలులోకి తీసుకువస్తామని జస్టిస్ అభయ్ శ్రీనివాస్ ఓకా ధర్మాసనానికి హామీ ఇచ్చారు. వాయు కాలుష్యం అరికట్టేందుకు చట్టాన్ని అమలు చేసేందుకు అవసరమైన యంత్రాంగం లేకుండానే ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ చట్టాన్ని రూపొందించారని ధర్మాసనం పేర్కొంది. పరిశుభ్రమైన, కాలుష్య రహిత వాతావరణంలో జీవించడం పౌరుల ప్రాథమిక హక్కు అని ధర్మాసనం స్పష్టం చేసింది. పౌరుల హక్కులను కాపాడడం కేంద్ర, రాష్ట్రాల కర్తవ్యమని చెప్పింది. ఆర్టికల్ 21 ప్రకారం ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని సుప్రీంకోర్టు పేర్కొంది. నిబంధనలు ఉల్లంఘించిన వారికి విధించే జరిమానాను పెంచేందుకు చట్టాన్ని సవరించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. అయితే, పంజాబ్, హర్యానా రెండు రాష్ట్రాల కార్యదర్శి (పర్యావరణ), అదనపు ప్రధాన కార్యదర్శి (వ్యవసాయం)కి షోకాజ్ నోటీసులు అందించామని ఏఎస్‌జీ తెలిపారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు సిద్ధంగా ఉంటే సెక్షన్ 15 సవరణకు ముందు ప్రతిదీ జరిగి ఉండేదని.. ఇదంతా రాజకీయం.. మరేమీ కాదని కోర్టు పేర్కొంది. మరో వైపు పంజాబ్, హర్యానా ప్రభుత్వాలపై సైతం సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం చేసింది. చెత్తను దహనం చేసిన వారిపై రెండు రాష్ట్రాలు ఎలాంటి శిక్షార్హమైన చర్యలు తీసుకోలేదని పేర్కొంది. చట్టాన్ని అమలు చేసేందుకు రాష్ట్రాలకు ఆసక్తి ఉంటే కనీసం ప్రాసిక్యూషన్ అయినా ఖచ్చితంగా జరుగుతుందని కోర్టు పేర్కొంది. సుమారు 1,080 ఎఫ్ఐఆర్‌లు, 473 మంది నామమాత్రపు జరిమానాలే విధించారని పంజాబ్ సెక్రెటరీపై సుప్రీంకోర్టు పేర్కొంది. చట్టాన్ని ఉల్లంఘించిన వారికి ఏం చేయబోవటంటూ సిగ్నల్ ఇస్తున్నారా? అంటూ ప్రశ్నించింది. గత మూడేళ్లుగా ఇదే జరుగుతోందని మండిపడింది. 400 వ్యవర్థాలు దహన ఘటనలు జరిగాయని హర్యానా ప్రధాన కార్యదర్శి సుప్రీంకోర్టుకు తెలిపారు. రాష్ట్రంలో 32 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని చెప్పగా.. సర్వోన్నత న్యాయస్థానం అసహనం వ్యక్తం చేస్తూ.. లెక్కలపై అబద్ధాలు చెబుతున్నారని కోర్టు పేర్కొంది. కొందరికి జరిమానాలు విధించి.. మరికొందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసినట్లు చెప్పింది. ఇక వాయు కాలుష్యం కేసును దీపావళి తర్వాత విచారించనున్నట్లు తెలిపింది. ఢిల్లీలో వాహనాలతో కాలుష్యం, నగరంలోకి భారీ ట్రక్కుల ప్రవేశం, బహిరంగ ప్రదేశాల్లో చెత్త దహనం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుంటామని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

## ఈ నెల 25 న రిలయన్స్ నిప్పోన్ లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పోస్టులకు జాబ్-మేళా

### - 30 పోస్టులలో మహిళలకు మాత్రమే అవకాశం

హైదరాబాద్, అక్టోబర్ 24 : ఉస్మానియా యూనివర్సిటీ లోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో రిలయన్స్ నిప్పోన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఈ నెల 25న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. కంపెనీలోని 30 లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. డిగ్రీ, మాస్టర్స్ పూర్తి చేసిన 29 నుండి 45 సంవత్సరాల వయసు గల మహిళలకు మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక ప్రకటనలో తెలియజేసింది. మరిన్ని వివరాలకు ఎంప్లాయిమెంట్ అధికారి జోషిని (ఫోన్.8340037123) సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. విద్యార్హతల సర్టిఫికెట్లతో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో వద్ద హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు

# వైసిపికి మహిళా నేత వాసిరెడ్డి పద్మ రాజీనామా

అమరావతి అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):వైసిపికి మరో షాక్ తగిలింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పలువురు నాయకులు జగన్ కు గుడ్ బై చెబుతూ పార్టీని విడుతున్నారు. ఇప్పటికే పలువురు నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. తాజాగా ఆ పార్టీ మహిళా నేత వాసిరెడ్డి పద్మ కూడా రాజీనామా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ నుంచి ఆమె టికెట్ ఆశించారు. జగన్ మాత్రం ఆమెకు టికెట్ ఇవ్వలేదు. దీంతో కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న వాసిరెడ్డి పద్మ.. బుధవారం పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను జగన్ కు పంపారు. ఇందులో జగన్ విధానాలను తీవ్రంగా విమర్శించారు. గుడ్ బుక్ పేరుతో మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యకర్తల కోసం గుడ్ బుక్ కాదు..గుండె బుక్ కావాలన్నారు. జగన్‌వి అప్రజాస్వామిక పద్ధతులు, నియంతృత్వ ధోరణి, సమాజం పట్ల, పాలనలో, పార్టీని నడపడంలో జగన్ బాధ్యతగాలేరని వాసిరెడ్డి పద్మ విమర్శలు చేశారు. కాగా, వైసీపీ హయాంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా ఆమె బాధ్యతలు నిర్వహించారు.

# మహిళలకు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు

-ఆలయ కమిటీల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు చోటు

- ఏపీ కేబినెట్ సమావేశం కీలక నిర్ణయాలకు ఆమోదం



అమరావతి అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఏపీ కేబినెట్ సమావేశం కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు దీపావళి పండుగ సందర్భంగా ప్రభుత్వం మహిళలకు ఉచిత సిలిండర్లను కానుకగా ప్రకటించింది. ఏడాదికి మూడు సిలిండర్లను ఒకే సారి కాకుండా నాలుగు నెలలకు ఒకటి చొప్పున అందించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అయితే సిలిండర్‌కు డబ్బు చెల్లిస్తే 48 గంటల్లో తిరిగి వారి ఖాతాల్లో వేయాలని నిర్ణయించారు.. అదేవిధంగా ఉచిత ఇసుకపై జిల్లా మంత్రులు, ఇన్‌ఛార్జ్ మంత్రులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఉచిత ఇసుక సరిగా అమలయ్యేలా చూడాలని, ఇసుక లేని జిల్లాల్లో మినరల్ డీలర్లను పెట్టి ధరల నియంత్రణ చేపట్టాలని సూచించారు. ఆలయ కమిటీల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పించాలని, ఆలయ కమిటీల్లో సభ్యుల సంఖ్య పెంచే చట్ట సవరణకు ఆమోదం తెలిపింది. శారదా పీఠం భూకేటాయింపుల రద్దుకు ఆమోదం ప్రకటించింది. ఎర్రమట్టి దిబ్బల తవ్వకాల్లో అక్రమాలపై చర్యలకు కమిటీ వేయాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది.




# విద్యుత్ మీటర్ కనెక్షన్ కోసం లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన లైన్ ఇన్‌స్పెక్టర్



భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : విద్యుత్ మీటర్ కనెక్షన్ కోసం లంచం తీసుకుంటూ లైన్ ఇన్‌స్పెక్టర్‌ఏసీబీకి పట్టుబడ్డాడు.

ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలో ఓ ఇంటి యజమాని విద్యుత్ మీటర్ కనెక్షన్ కోసం లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజును సంప్రదించాడు. అందుకు రూ. 26,000 లంచం ఇవ్వాలని లైన్ ఇన్‌స్పెక్టర్ డిమాండ్ చేశాడు. దీంతో చేసేదేమి లేక బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు నాగరాజుకు లంచం ఇస్తుండగా ఏసీబీ సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం పాల్వంచ సబ్ స్టేషన్‌లో సోదాలు నిర్వహించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ రమేష్ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కర్నూలు బీసీ భవన్ నిర్మాణానికి రెండు కోట్లు 50 లక్షలు విడుదల

## - సీఎం చంద్రబాబు నక్కల మిట్ట శ్రీనివాసులు అభినందనలు

కర్నూలు అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాల వైసిపి పాలనల్లో రాష్ట్రంలో బీసీ భవనాల నిర్మాణంలో వైసిపి ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహించిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు విమర్శించారు. 2014-2019 తెలుగుదేశం పార్టీ అధికాంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో బీసీ భవనాలకు శంకుస్థాపనలు జరిగి నిర్మాణాలు ప్రారంభమయ్యాయని కానీ వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాలు బీసీ భవనాలను కనీసం లక్ష రూపాయలు కూడా ఖర్చు పెట్టకుండా ప్రారంభం చేసి కొంత పనులు అయిన తర్వాత వాటిల్లో చెట్లు మొలిచి నిర్మాణాలు ఇనుము తుప్పు పట్టి వెక్కిరిస్తున్నాయని నక్కల మిట్ల శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు కోట్ల రూపాయలతో కర్నూలు బీసీ భవన్ నిర్మాణం 2018లో నాటి డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగి వైసీపీ ప్రభుత్వం రాకతో పూర్తిగా పనులు ఆగిపోయాయని ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారు బిజెపి పార్టీ రాష్ట్రంలో బీసీ భవనాల నిర్మాణాలు పున ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని లక్ష్యంతో రెండున్నర కోట్లు విడుదల చేసిన సందర్భంగా ఈరోజు కర్నూలుకు విచ్చేసిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ వ్యవహారాల ఇన్చార్జి కర్రీ వేణుమాధవ్ కలిసి బీసీ భవన నిర్మాణ స్థలాన్ని ఆయన బీసీ నాయకులతో సందర్శించారు. ఈ సందర్భంగా వేణుమాధవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ భవనాల యొక్క దుస్థితిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి వెళ్లడంతో కర్నూలు బిసి భవన నిర్మాణానికి పనికి రెండు కోట్లు 50 లక్షలు విడుదల చేసి పనులు ప్రారంభం అయ్యేలా ఎన్డీఏ ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ పి విజయ్ కుమార్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి షేక్ అన్వర్ హుస్సేన్ పాల్గొన్నారు

# 55వ 'ఇఫీ' ప్రతినిధుల నమోదు ప్రక్రియ ప్రారంభం

న్యూఢిల్లీ, అక్టోబర్ 24: పండగ ఉత్సాహంతో నవంబర్ వచ్చేస్తోంది. నవంబరు 20 నుంచి 28 వరకు గోవాలోని పనాజీలో జరిగే భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ-ఇఫీ)లో పాల్గొనేందుకు మీకు ఇదే మా ఆహ్వానం. గోవాలోని అరేబియా సముద్ర తీర అందాల నడుమ సినిమా సంబరాన్ని ఉత్సాహంగా జరుపుకొనేందుకు ప్రపంచం నలుమూలల నుంచి చలనచిత్ర ప్రేమికులు ఒక చోట కలిసుకునే సందర్భమిది.

మీరు ప్రపంచంలో విభిన్న ప్రాంతాలకు, వివిధ సాంస్కృతిక నేపథ్యాలకు చెందిన వారు కావచ్చు. కానీ సినిమాను ఇష్టపడేవారందరినీ ఒక్క చోటుకు చేర్చే అవకాశాన్ని ఇఫీ అందిస్తుంది. ఈ కళా బంధాన్ని ఉత్సవంలా జరుపుకోవడానికి, వెండితెర మీద చలనచిత్రాలు చెప్పే కథల అద్భుతాన్ని ఆస్వాదించేందుకు అందరినీ ఆహ్వానిస్తున్నాం. https://my.iffigoa.org/ లో మీ పేరు, వివరాలు నమోదు చేసి ఈ ఏడాది జరగబోయే చలనచిత్రోత్సవానికి ఇఫీ ప్రతినిధిగా హాజరవ్వచ్చు.

'ఇఫీ'లో ఎందుకు పాల్గొనాలి?

అంతర్జాతీయంగా 16 విభాగాల్లో ఎంపిక చేసిన సినిమాలను 55వ చలనిచత్రోత్సవాల్లో మీరు వీక్షించవచ్చు. మనసును తడి చేసే సినిమాలు, ఉద్వేగ్నం కలిగించే డాక్యుమెంటరీలు, లేదా వినూత్న లఘు చిత్రాలు ఏదైనా కావచ్చు.. సినీ ప్రేమికులు ఆస్వాదించేందుకు ఈ చలనచిత్రోత్సవంలో ఏదో ఒకటి ఎదురవుతూనే ఉంటుంది. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సినిమాలను విడుదలకు ముందే ఇక్కడ, చలనచిత్రోత్సవంలో చూసే అపూర్వ అవకాశం ఇఫీ ప్రతినిధులుగా మీకు దక్కుతుంది.

ఇఫీ నిర్వహించే శిక్షణా తరగతులు, కార్యశాలల్లో చలన చిత్ర రంగ ప్రముఖులు, నిపుణులు తమ ఆలోచనలను, అనుభవాలను పంచుకుంటారు. మీరు వర్ధమాన చలనచిత్ర దర్శకుడైతే, మీరు చేపట్టే తదుపరి ప్రాజెక్టుకు స్ఫూర్తి పొందడానికి, మీ కలను సాకారం చేసుకొనే ప్రేరణ పొందడానికి ఇక్కడ జరిగే చర్చా కార్యక్రమాల్లో పాల్గొనండి. మీ ఆలోచనలు పంచుకోండి. స్నేహితులను పెంచుకోండి.

చలనచిత్ర పరిశ్రమకు సంబంధించిన ఎన్నో విషయాలను స్వయంగా దగ్గర నుంచి గమనించే అవకాశాన్ని మీరు పొందవచ్చు. ఈ రంగంలో ప్రసిద్ధి పొందిన దర్శకులు, నటులు, ఇతర దిగ్గజాలును గౌరవించేందుకు ఉద్దేశించినదే ఇఫీ రెడ్ కార్పెట్. వారు తమ చిత్రాలను ప్రదర్శించడానికి, సినిమా పట్ల ప్రేమను చాటడానికి ఇక్కడకి వస్తారు. వారందరినీ కలుసుకునే అవకాశం ఇఫీ ప్రతినిధులకు దక్కుతుంది. మీరు మెచ్చే చిత్రాలను తీసిన వారితో నేరుగా మాట్లాడి, మీ ఆలోచనలు పంచుకొనే అనుభవం ఎలా ఉంటుందో ఓసారి ఊహించుకోండి.

వర్ధమాన ప్రతిభ, సినిమాలకు సంబంధించిన అంశాలన్నీ ఒక్కచోట చేర్చే వేదికగా భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం మీ ముందుకు రాబోతోంది. ఈ కార్యక్రమానికి హాజరైన వారు 'క్రియేటివ్ మైండ్స్ ఆఫ్ టుమారో', 'ఫిలిం బజార్', 'సినీ మేళా'ల తాజా సంచికలు అందుకోవచ్చు.

మరపురాని జీవితానుభూతిని పొందడానికి సిద్ధంగా ఉండండి. ఈ అద్భుతమైన సినీ ప్రయాణంలో పాల్గొనే అవకాశాన్ని వదులుకోవద్దు.

ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందరూ ఈ చలన చిత్రోత్సవంలో పాల్గొనేలా అన్ని ఏర్పాట్లు చేశారు. దివ్యాంగుల అవసరాలకు తగినట్లుగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వారికోసం చిత్రాలను ప్రదర్శించే ఈఎస్‌జీ, ఇతర వేదికల వద్ద ర్యాంపులు, హ్యాండ్ రెయిల్స్, అనువైన నడక దారులు, టాయిలెట్లు, బ్రెయిలీ లిపిలో ప్రత్యేక సూచికలు ఏర్పాటు చేశారు. వాహనాలు నిలిపేందుకు ప్రత్యేక స్థలాలు కేటాయించారు. తద్వారా చలనచిత్రోత్సవ సంబరాల్లో ఎవరూ వెనకబడి ఉండిపోకుండా చర్యలు తీసుకున్నారు.

ఈ కేటగిరీల ద్వారా సినీ రంగ నిపుణులు, సినిమా ప్రేమికులు, విద్యార్థులకు వేర్వేరు ప్రయోజనాలు అందుతాయి. విద్యార్థులు రోజుకి నాలుగు టికెట్లు ఉచితంగా పొందడం ద్వారా వినిమాలు, వాటికి సంబంధించిన కార్యక్రమాలపై విస్తృత అవగాహన పొందవచ్చు. సినిమా నిపుణులు రోజుకు అదనంగా మరో టికెట్ పొందవచ్చు.

# జాతీయ పోషకాహార సంస్థను సందర్శించిన జమ్మూ కాశ్మీర్ మీడియా ప్రతినిధుల బృందం

న్యూఢిల్లీ, అక్టోబర్ 24: పీఐబీ శ్రీనగర్ డిప్యూటీ డైరెక్టర్ తారిఖ్ రాథర్ నేతృత్వంలో, జమ్మూ కాశ్మీర్‌కు చెందిన 14 మంది మీడియా ప్రతినిధుల బృందం ఈనెల 21 నుంచి 25 వరకు 5 రోజుల పాటు తెలంగాణలో పర్యటిస్తోంది. పర్యటన రెండో రోజున, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఐసీఎంఆర్-జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్)ను ఈ ప్రతినిధి బృందం సందర్శించింది. ఈ రోజు మనం ఎదుర్కొంటున్న పోషకాహార, ఆరోగ్యపరమైన సవాళ్లను పరిష్కరించడం కోసం బహుళ రంగాలకు చెందిన శాస్త్రవేత్తల బృందం, సాంకేతిక బృందంతో కలిసి ఎన్ఐఎన్ అవిశ్రాంత కృషి చేస్తోంది. ఆహారం, పోషకాల వినియోగం తీరును గురించి ఎన్ఐఎన్ ఆధారాలతో కూడిన సూచనలు చేస్తుంది. అలాగే మాతాశిశు పోషణ సహా వివిధ వయస్సులు, శారీరక సమూహాలకు చెందిన వారిలో పోషకాహార స్థితి ధోరణులను తెలిజేస్తుంది.

ఈ సందర్భంగా మీడియా ప్రతినిధి బృందంతో ఐసీఎమ్ ఆర్-ఎన్ఐఎన్ డైరెక్టర్-ఇన్‌చార్జ్ డాక్టర్ శాంతసాబుజ దాస్ మాట్లాడుతూ, అనేక అంటువ్యాధులు, అంటువ్యాధులు కాని జబ్బుల ముప్పు, వ్యాప్తికి అత్యంత ముఖ్యమైన పర్యావరణ కారకాల్లో పోషకాహార లోపం ఒకటని తెలిపారు. దేశంలో కరోనరీ గుండె జబ్బులు, అధిక రక్తపోటు, మధుమేహం కారణంగా సగానికి పైగా డీఏఎల్‌వైల (డిజెబిలిటీ-అడ్జస్టెడ్ లైఫ్ ఇయర్) వ్యాధి భారానికి అనారోగ్య కరమైన ఆహారపు అలవాట్లే ప్రధాన ప్రమాద కారకంగా ఉన్నాయన్నారు. అంటువ్యాధులు, అంటువ్యాధులు కాని దీర్ఘకాలిక వ్యాధుల నివారణ, చికిత్స వివిధ రకాల పోషకాహార లోపంతో ముడిపడి ఉంటుందని పేర్కొన్నారు. ఆర్థిక శాస్త్రం పరంగా చూస్తే, అకాల మరణాలు, ఒత్తిడిలో గల ఆరోగ్య వ్యవస్థల రూపంలో పోషకాహార లోపం వల్ల కలిగే నష్టం ఎక్కువగా ఉందనీ, ఇది ఆర్థిక పురోగతినీ అడ్డుకుంటుందన్నారు. మంచి పౌష్టికాహారం వ్యక్తినీ ఆపై కుటుంబాన్నీ ప్రభావితం చేసే ముఖ్య వనరు అని, ఇది సమాజానికీ ప్రయోజనకరం అవుతుందని ఆయన వివరించారు.

ఆరోగ్యకరమైన, సుస్థిరమైన, పర్యావరణ-హితమైన ఆహారపు అలవాట్లు, జీవనశైలి ద్వారా భారత్‌లో అన్ని రూపాల్లో గల పోషకాహార లోపాన్ని నిర్మూలించడం కోసం ఎన్ఐఎన్ నిర్వహిస్తున్న పరిశోధన గురించి డాక్టర్ సుబ్బారావు నేతృత్వంలోని, డాక్టర్ ఎమ్. మహేశ్వర్, డాక్టర్ జి. భానుప్రకాశ్ రెడ్డి, డాక్టర్ జె.జె. బాబులతో కూడిన శాస్త్రవేత్తల బృందం వారి విలువైన అభిప్రాయాలను పంచుకున్నారు. ముప్పు అధికంగా ఉన్న ప్రజల్లో పోషకాహార లోపం, రక్తహీనత, అయోడిన్ లోపం, వివిధ సూక్ష్మపోషకాల లోపం వంటి ముఖ్యమైన ప్రజారోగ్య పోషకాహార సమస్యలను పరిష్కరించేందుకు నాణ్యమైన ఆధారాలను ఎన్ఐఎన్ రూపొందిస్తుంది. కమ్యూనిటీ ఆధారిత ట్రయల్స్ (ప్రభావాన్ని పరీక్షించడం) ద్వారా దేశంలో పోషకాహార లోపాన్ని నివారించడానికి, నియంత్రించడానికి వివిధ నమూనాలను ఎన్ఐఎన్ అభివృద్ధి చేస్తోంది.

ఆండ్రాయిడ్ పరికరాల కోసం ఉచిత జీవనశైలి యాప్ న్యూట్రిఫై ఇండియా నౌ 2.0ను ఎన్ఐఎన్ ఐసీఎమ్ఆర్ అభివృద్ధి చేసింది. ఈ సమగ్ర యాప్ మీరు తీసుకునే పోషకాహారం, శారీరక శ్రమ, మొత్తం శ్రేయస్సును పర్యవేక్షించడం వంటి మీ విభిన్న అవసరాలను తీరుస్తూ మీ వ్యక్తిగత ఆరోగ్య సహాయకునిగా పనిచేస్తుంది. మంచి ఆరోగ్యం, శ్రేయస్సును ప్రోత్సహించడానికి ఆహారంలో లభించే పోషకాలు, వాటి రోజువారీ అవసరాల గురించి అవసరమైన సమాచారాన్ని ఈ యాప్ అందిస్తుంది. వినియోగదారులు వారి పోషకాహార స్థితిని, రిక్వైర్డ్ డైటరీ అలవెన్స్ (ఆర్‌డీఏ), ప్రతిరోజూ తీసుకునే ఆహారం, వినియోగించిన శక్తిని అంచనా వేయడంలో సహాయపడేందుకు ఇది ముడి ఆహార పదార్థాలు, వంటకాల్లో గల పోషకాల వివరాల గురించి సమాచారమిస్తుంది.

హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్), డైట్ అండ్ బయోమార్కర్ సర్వే ఇన్ ఇండియా (డీఏబీఎస్-ఎ) పేరుతో లదాఖ్‌లో ఒక అధ్యయనం నిర్వహించింది. లదాఖ్ ప్రజల పోషకాహార అలవాట్లు, వారికి అవగాహనలేని ఆహార వంటకాలు, అక్కడి రక్తహీనత పరిస్థితులపై సూచనలు అందించడం ఈ అధ్యయనం లక్ష్యం. వివిధ సామాజిక, ఆర్థిక తరగతులకు చెందిన ప్రజలు తీసుకునే ఆహారం, పోషకాల మాల్యాంకనం, ఈ ప్రాంతంలో రక్తహీనత వ్యాప్తి, పోషక లోపాన్ని అంచనా వేయడం, అలాగే ఆహార వినియోగాన్ని విశ్లేషించడం లక్ష్యంగా చేపట్టిన ఒక మిషన్-మోడ్ ప్రాజెక్ట్‌గా శాస్త్రవేత్తలు దీనిని అభివర్ణించారు.

ఐసీఎమ్ఆర్-ఎన్ఐఎన్ వద్ద గల వివిధ ప్రయోగశాలలనూ మీడియా ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఇక్కడ ఆహార సంబంధ ఉత్పత్తులు మొదలైన వాటిని విశ్లేషించే విధానాన్ని సంస్థకు చెందిన సీనియర్ శాస్త్రవేత్తలు మీడియా ప్రతినిధులకు వివరించారు.

హైదరాబాద్, తెలంగాణలో ఉన్న కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ముఖ్య సంస్థలు, ప్రముఖ ప్రదేశాలను గురించి మీడియా ప్రతినిధులకు సమగ్ర అవగాహన కలిగించే లక్ష్యంతో ఈ పర్యటన చేపట్టారు. తెలంగాణలో అమలవుతున్న వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతిని పరిశీలించే అవకాశాన్ని మీడియాకు కల్పించడం కోసం 'అభివృద్ధిని తెలియజేయడం ఉ సమాచారాన్ని వ్యాప్తి చేయడం' అనే కేంద్ర ప్రభుత్వ రంగ పథకం కింద పీఐబీ జమ్మూ కాశ్మీర్ ఈ పర్యటనను నిర్వహిస్తోంది.

# శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుపతి అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో గురువారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. దీపావళి ఆస్థానం సందర్భంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ.

ఈ సందర్భంగా ఉదయం 6.30 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీ గోవిందరాజస్వామివారి సన్నిధితో పాటు ఆలయ ప్రాంగణంలోని ఇతర ఆలయాల గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీ గడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. అక్టోబరు 30వ తేదీ దీపావళి సందర్భంగా సాయంత్రం 4 నుండి 5.30 గంటల వరకు శ్రీవారి సన్నిధి, శ్రీ పార్థసారథి స్వామి, శ్రీ ఆండాళ్ అమ్మవారు, శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి, శ్రీ పుండరీకవల్లి అమ్మవారు, శ్రీ భాష్యకారుల వారికి, తైల సమర్పణ నిర్వహించనున్నారు.

అక్టోబర్ 31న సాయంత్రం 5:30 నుండి 6:30 గంటల వరకు దీపావళి ఆస్థానం వైభవంగా జరుగనుంది. ఆలయ ప్రాంగణంలోని శ్రీ పుండరికవల్లి అమ్మవారి ఆలయం నుండి నూతన వస్త్రాలు, దీపాలు తీసుకువచ్చి స్వామివారికి సమర్పిస్తారు. అనంతరం ఆలయంలో దీపావళి ఆస్థానం ఘనంగా నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శ్రీమతి శాంతి, సూపరింటెండెంట్ శ్రీ చిరంజీవి, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ ధనంజయులు, అర్చక బృందం పాల్గొన్నారు.

# నాటుసారా విక్రయించిన ఏడుగురి బైండోవర్



ఆదిలాబాద్, అక్టోబర్ 24: నాటుసారాను తయారుచేసి విక్రయించిన మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఏడుగురిని గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ నర్సిమ్ములు తెలిపారు.

జన్నారం మండలంలోని చింతగూడ, కిష్టాపూర్, కలమడుగు, చింతలపల్లి, మహమ్మదాబాద్, తిమ్మాపూర్, రేండ్లగూడ గ్రామాలకు చెందిన బాదావత్ లక్ష్మి, పుట్ట కొక్కుల నరేష్, ఎల్.సంతోష్ నాయక్, గొల్లె అమృత, డొంగరి విజయలక్ష్మి, గందం లక్ష్మిలు నాటు సారా తయారు చేసి అమ్ముతున్నారనే అభియోగం మేరకు కేసులు నమోదు చేసి, సత్ప్రవర్తన కోసం రూ.లక్ష, ఏడాది జైలు శిక్ష అమలు కోసం స్థానిక డిప్యూటీ తహసిల్దార్ రామ్మోహన్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.

వారందరిచే బాండ్ పేపర్ పై అగ్రిమెంట్ రాయించుకొని ఆ డిప్యూటీ తహసీల్దార్ సొంత పూచికపై వదిలినట్లు అయన చెప్పారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ? ఇకముందు నాటుసారా తయారు చేసి అమ్మినట్లయితే పీడీ కేసులు నమోదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

# ఎంఎల్ఏల పార్టీ ఫిరాయింపుల కేసు వచ్చే నెల 4వ తేదీకి వాయిదా

హైదరాబాద్ అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఎంఎల్ఏల పార్టీ ఫిరాయింపుల కేసులో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ లో దాఖలైన పిటిషన్ పై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. కాగా వాదనలు వినిపించేందుకు అడ్వకేట్ జనరల్ గడువును కోరారు. ఈ కేసు విచారణను కోర్టు వచ్చే నెల 4వ తేదీకి వాయిదా వేసింది. తమ పార్టీ ద్వారా గెలిచిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులు కాంగ్రెస్ లోకి పార్టీ ఫిరాయింపు జరిపారని, వారిపై అనర్హత వేటు వేసేలా స్పీకర్ కు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బిఆర్ఎస్ ఎంఎల్ఏ పాడి కౌశిక్ రెడ్డి, కెపి. వివేకానంద హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జీ బెంచ్ కీలక తీర్పునిచ్చింది. ఎంఎల్ఏల పార్టీ ఫిరాయింపులపై దాఖలైన అనర్హత పిటిషన్ల స్టేటస్ ఏమిటో చెప్పేందుకు నాలుగు వారాల గడువు ఇస్తున్నామని?ఆ లోగా వివరాలు అందజేయకుంటే మేమే తగిన ఆదేశాలు జారీ చేయాల్సి వస్తుందని అసెంబ్లీ సెక్రటరీకి హైకోర్టు సింగిల్ జడ్జీ బెంచ్ స్పష్టం చేసింది. ఇదిలావుండగా సింగిల్ జడ్జీ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ అసెంబ్లీ సెక్రటరీ డివిజన్ బెంచ్ లో అప్పీలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ జరిపాక ధర్మాసనం తదుపరి తేదీకి విచారణను వాయిదా వేసింది.

# తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్‌లోని పరిణామాలను జీర్ణించుకోలేకపోతున్నా..

**-పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీకి లేఖ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి..**

హైదరాబాద్ అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్‌లోని పరిణామాలను జీర్ణించుకోలేకపోతున్నానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి.. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాశారు. తీవ్ర మానసిక బాధతో లేఖ రాస్తున్నానని, లేఖ రాస్తున్నందుకు తాను విచారిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు.పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు ప్రత్యేక గుర్తింపు ఇస్తున్నారని, కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులో కీలకంగా పనిచేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కూడా పార్టీలో చేర్చుకున్నారని తెలిపారు. పదేళ్లు బీఆర్ఎస్ దుర్మార్గాలపై పోరాడానని చెప్పారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే.. తన అనుచరుడిని కిరాతకంగా చంపేశాడని జీవన్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

# ఏపీపీఎస్సీ చైర్ పర్సన్‌గా అనురాధ బాధ్యతల స్వీకరణ

విజయవాడ, అక్టోబర్ 24: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఛైర్‌పర్సన్‌గా రిటైర్డ్ ఐపీఎస్ అధికారిణి అనురాధ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ బందర్ రోడ్డులోని ఏపీపీఎస్సీ కార్యాలయంలోని ఛాంబర్‌లో ఇవాళ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆమెతో ఏపీపీఎస్సీ కార్యదర్శి జె ప్రదీప్ కుమార్ పదవీ ప్రమాణస్వీకారం చేయించారు.

బాధ్యతల స్వీకరణ అనంతరం ఏపీపీఎస్సీలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న నియామకాలపై బోర్డు సభ్యులు, అధికారులతో అనురాధ సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రూప్-1, గ్రూప్-2తో పాటు నిర్వహించాల్సిన పలు నియామక పరీక్షలు, ఇంటర్వ్యూలపై ఛైర్‌పర్సన్ ఆరా తీశారు.

గత వైసీపీ ప్రభుత్వం గౌతమ్ సవాంగ్‌ను ఏపీపీఎస్సీ చైర్మన్‌గా నియమించింది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో సవాంగ్ తన పదవికి రాజీనామా చేశారు.

ఆయన రాజీనామా అనంతరం ఈ పదవి ఖాళీగానే ఉంది. తాజాగా అనురాధను ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, అనురాధ గతంలో ఇంటెలిజెన్స్ చీఫ్, హోంశాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు.

# నిరుద్యోగ యువతను నిర్లక్ష్యం చేసిన వైసీపీ.. ఎంపీ చిన్ని

**-యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం..**
**-త్వరలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు..**
**-స్టడీ సర్కిల్స్ ని సద్వినియోగం చేసుకోండి?**
**-ఎమ్మెల్యే కొలిక్కపూడి ఆధ్వర్యంలో ఉచిత స్టడీ సర్కిల్ ప్రారంభం..**

అమరావతి, అక్టోబర్ 23: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాద్ విమర్శించారు. గత ప్రభుత్వ తప్పిదాల కారణంగా నిరుద్యోగ యువతకి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయావన్నారు. విజయవాడ పార్లమెంటు పరిధిలోని తిరువూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ సెంటర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ ను గురువారం ఎంపీ చిన్ని ప్రారంభించారు.

ఈసందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ సెంటర్ ను ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును అభినందించారు. తిరువూరు నియోజకవర్గంలో సిల్క్ డెవలప్మెంట్ ద్వారా నాలుగు ఐదు సిల్క్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల యువత ఉద్యోగాలు లేక నిరుద్యోగ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యువతకు 20లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు.

యువత, నిరుద్యోగులు ఈ స్టడీ సర్కిల్ ని ఉపయోగించుకొని పోటీ పరీక్షలకు తయారు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, తిరువూరు నియోజకవర్గ పరిశీలకులు చిట్టాబత్తిన శ్రీనివాసరావు (చిట్టిబాబు) తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేటీఆర్ ఇచ్చిన లీగల్ నోటీసులకు.. నోటీసులతోనే బదులిస్తాం...

**- రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకు లీగల్ నోటీసులే సమాధానమైతే మీకూ వంద నోటీసులు పంపించాల్సి వస్తుంది**
**- బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్**




హైదరాబాద్ అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్ కుమార్ గారికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసుల విషయంలో భారతీయ జనతా పార్టీ బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ ధీటుగా స్పందించారు.చేసిన తప్పులు, దూషణలు, ఆరోపణలు చాలదన్నట్లు.. తగుదునమ్మా అన్నట్లు కేటీఆర్ లీగల్ నోటీసులివ్వడాన్ని తీవ్రంగా ఖండించారు.బుదవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా తో మాట్లాడుతూ కేటీఆర్..! ఆట నువ్వు మొదలుపెట్టావు.. ఆ ఆట మేం ముగిస్తాం...!బండి సంజయ్ కుమార్ కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ లీగల్ నోటీసులు ఇచ్చినట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి.కేటీఆర్ ఇచ్చిన లీగల్ నోటీసులకు.. నోటీసులతోనే బదులిస్తాం.కేటీఆర్..! రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకు లీగల్ నోటీసులే సమాధానమైతే మీకూ వంద నోటీసులు పంపించాల్సి వస్తుందని హెచ్చరించారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో బండి సంజయ్ కుమార్ ను అనేక రకాలుగా హింస పెట్టారు.సాక్షాత్తు బండి సంజయ్ కుమార్ కార్యాలయంలో పోలీసులు గ్యాస్ కట్టర్‌తో తాళాలు పగులగొట్టి.. బిజెపి కార్యకర్తల తలలు పగులగొట్టి జైలుకు పంపించిన్రు. దాని వెనుక ఉన్నది మీరే కదా..!వ్యక్తిగతంగా అనేక రకాలుగా దిగజారుడు మాటలతో దూషించింది బీఆర్ఎస్ నాయకులేనన్నది గుర్తు చేసారు..బిజెపి లో అంచెలంచెలుగా ఎదిగిన బీసీ నాయకుడు బండి సంజయ్ కుమార్ గారిని అస్తమానం అవమానపర్చింది బీఆర్ఎస్ పార్టీ. చేసిన తప్పులు, దూషణలు, ఆరోపణలు చాలదన్నట్లు.. తగుదునమ్మా అంటూ లీగల్ నోటీసులిస్తే భయపడుతామా..!కేటీఆర్ లీగల్ నోటీసులకు భయపడే నాయకుడు కాదు.ఇకపై కాచుకోండి.. మీకూ లీగల్ నోటీసులతో ధీటుగా సమాధానం ఇస్తాం.చదువురాని వారు, పట్టాలు లేనివారు గ్రూప్-1 పరీక్ష అభ్యర్థుల కోసం పోరాడుతారా అంటూ కేటీఆర్ హీనంగా మాట్లాడటం హేయనీయం.అసభ్య పదజాలానికి, బూతు పదాలకు, దిగజారుడు విమర్శలకు బ్రహ్మపదార్థం లాంటిది బీఆర్ఎస్ పార్టీ. బీఆర్ఎస్ నాయకుల నోటీసులకు, కేసులకు బిజెపి నాయకులు భయపడేవారు కాదు. మీరు ఎన్ని నోటీసులు పంపినా, ఎన్ని కేసులు పెట్టినా ధీటుగా ఎదుర్కొని గట్టి జవాబు ఇస్తామన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తే క్రిమినల్ కేసులు.. డీఎస్పీ సంపత్ రావు



వరంగల్, అక్టోబర్ 24: ఉమ్మడి చిట్యాల మండలంలోని మానేరు, చలివాగు పరివాహక ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, అర్ధరాత్రి తరలిస్తే తగు చర్యలు తప్పవని భూపాలపల్లి డీఎస్పీ ఏ సంపత్ రావు అన్నారు. గురువారం మండలంలోని కాల్వపల్లి, కలికోట మానేరు వాగు ప్రాంతాలలో తిరిగారు.

అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ? ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా తమ అవసరాలకు ఇసుక వాడుకోవాలని, అక్రమంగా లాభార్జన ధ్యేయంగా వ్యాపారం చేస్తే క్రిమినల్ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. వాహనాలకు తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ నిబంధనలు ప్రకారం బిగించుకోవాలని డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఇన్సూరెన్స్ తప్పకుండా తీసుకోవాలని కోరారు.

లేని యెడల వాహనాలను సీజ్ చేసి మోటార్ వెహికల్ చట్ట ప్రకారం చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంలో చిట్యాల తహసీల్దార్ హేమ, చిట్యాల సీఐ దగ్గు మల్లేష్, ఎస్.ఐ శ్రావణ్ కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


# ప్రపంచ తెలుగు రచయితల సంఘం

కార్యాలయం చిరునామా: ప్రపంచ తెలుగు రచయితల సంఘం, సత్యాం టవర్స్, బకింగ్ హొంపేట పోస్టాఫీస్ ఎదురు, గవర్నర్‌పేటవిజయవాడ-520 002.

## "ఆలపిస్తాం తీయగా" యువగళ సమ్మేళనం
## ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో ప్రత్యేక ఆకర్షణ

2024 డిసెంబరు 28,29 తేదీలలో విజయవాడ కె.బి.యన్. కళాశాల ఆవరణలో జరిగే 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో "పర్యావరణాన్ని కాపాడుకుందాం" అనే అంశంపై "ఆలపిస్తాం తీయగా" ప్రత్యేక యువగళ సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నాం. ప్రముఖ రచయితలు వేదికపైన అశీనులై ఈ యువగళ సమ్మేళనాన్ని నడిపిస్తారు. రోజుకు 50 మంది చొప్పున రెండు రోజుల్లో 100 మంది కవులకు మాత్రమే ఈ యువగళ సమ్మేళనంలో పాల్గొనే అవకాశం ఉటుంది.

ప్రతిభావంతమైన ప్రదర్శనకు ఈ మహాసభలలో ప్రత్యేక సత్కారం, "పర్యావరణకవి" పురస్కారం అందించి గౌరవిస్తాము.

ప్రతినిధులుగా నమోదు చేసుకున్న వారికి మాత్రమే ఈ యువగళ సమ్మేళనంలో పాల్గొనే అవకాశం ఉంటుంది.

40 యేళ్లలోపు వారంతా ఈ యువగళ సమ్మేళనంలో పాల్గొనవచ్చు.

కవిత, గేయం,లలిత గీతం, గజల్, పద్యం ఏ ప్రక్రియలోనైనా తెలుగు భాషలో కవులు తమ గళాన్ని వినిపించవచ్చు.

2 నిమిషాల కాలవ్యవధి మించకుండా రచన ఉండాలి.

స్వీయ రచనలే అయి ఉండాలి. వ్రాతప్రతిని ముందుగా 9440 167697 నంబరుకు వాట్సాప్ ద్వారా గాని క్రింద ఇచ్చిన కార్యాలయం చిరునామాకు గాని అక్టోబరు 31లోగా పంపవలసి ఉంటుంది.

ఎంపికైన రచనలకు మాత్రమే యువగళంలో పాల్గొనే అవకాశం ఉంటుంది.

మహాసభల ఆహ్వానపత్రంలో యువగళ కవుల పేర్లు ప్రకటిస్తాము.

పర్యావరణాన్ని కాపాడుకునే విషయంలో నేటి తరం యువతీ యువకుల మనో భావాలను ఈ యువగళ సమ్మేళనం ప్రతిబింబిస్తుందని ఆశిస్తున్నాం. పర్యావరణ కవుల ఈ గళాలను పుస్తక రూపంలో తెచ్చే ప్రయత్నంలో ఉన్నాం.

ఈ మహాసభలలో విద్యార్థులకోసం కథ, కవిత పద్యం వగైరా 10 అంశాలపై శిక్షణా తరగతులు కూడా ఏర్పాటు చేస్తున్నాము. దేశం నలుమూలల నుండి తెలుగు విద్యార్థులు ఈ తరగతులలో పాల్గొంటున్నారు. విద్యాసంస్థ ధృవీకరణ పత్రంతో వస్తే, వారికి భోజన వసతి (డార్మెటరీ) సౌకర్యాలు ఉచితంగా ఏర్పాటు చేస్తున్నాము. అక్టోబరు 31లోగా వారు తమపేర్లను నమోదు చేసుకోవలసి ఉంటుంది.

పై రెండు కార్యక్రమాలే కాకుండా ప్రతినిధులకు కవిసమ్మేళనాలు, ప్రసంగ సదస్సులు, ఇంకా ఇతర సాహితీ కార్యక్రమాలు ఉంటాయి. ప్రతినిధులుగా నమోదయినవారు ఈ మహాసభలలో పైన పేర్కొన్న అంశాలలో తాము ఎందులో పాల్గొన దలచారో మాకు తెలియజేస్తే సాధ్యమైనంత ఎక్కువ మందికి అవకాశం కల్పించేందుకు ప్రయత్నిస్తాము.

**మరిన్ని వివరాలకు సంప్రదించండి:**

**గుత్తికొండ సుబ్బారావు- 9440167697,**
**డా॥ జి.వి.పూర్ణచందు-9440172642.**

కార్యాలయం చిరునామా: ప్రపంచ తెలుగు రచయితల సంఘం, సత్యాం టవర్స్, బకింగ్ హొంపేట పోస్టాఫీస్ ఎదురు, గవర్నర్‌పేట విజయవాడ-520 002.

# రైతుల సంక్షేమం కోసం జైలుకు పోవడానికి కూడా రెడీ..

### –బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు




ఆదిలాబాద్ అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): : ఈ రాష్ట్ర ప్రజలు, రైతుల సంక్షేమం కోసం జైలుకు పోవడానికి కూడా రెడీగా ఉన్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తప్పకుండా కాంగ్రెస్ పార్టీ నేతలను ఉరికించి కొట్టే రోజులు దగ్గర పడ్డాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని రామ్‌లీలా మైదానంలో ఏర్పాటు చేసిన రైతన్నల ధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్ నుంచి ఉదయం ఏడున్నరకు వెళ్లినం.. కానీ కాంగ్రెస్ పాలన ఎట్ల ఉందంటే.. అన్ని పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. మేడ్చల్ వద్దనే 45 నిమిషాలు పట్టింది. ఇక డిచ్‌పల్లి వద్ద కొందరు మహిళలు రోడ్డుకు అడ్డంగా కూర్చుని ధర్నా చేస్తున్నారు. ఏం కష్టమొచ్చింది అని దిగాను. వాళ్లు పోలీసోళ్ల భార్యలు. వన్ పోలీసింగ్ కావాలని డిచ్‌పల్లి బెటాలియన్ వద్ద ధర్నా చేస్తున్నారు. ధర్నా చేస్తున్న మమ్మల్ని రక్తం కారేలా గుంజుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఆ ఆడబిడ్డలు. అఖరికి కాంగ్రెస్ పాలనలో పోలీసోళ్ల భార్యలు ధర్నాలు చేసే పరిస్థితి.. వారు కూడా పోలీసోళ్ల చేతిలో దెబ్బలు తినే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ మండిపడ్డారు.

**చీటింగ్ కేసు పెడితే ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా మిగలడు..**

జైలుకు పోవడానికి రెడీ.. ప్రజలు, రైతుల కోసం ఒకట్రెండు ఏండ్లు జైల్లో ఉండేందుకు సిద్ధం. ఎవనీ అయ్యకు భయపడేది లేదు. తప్పకుండా కాంగ్రెస్‌ను ఉరికించి కొట్టే రోజులు దగ్గర పడ్డాయి. అసలు చీటింగ్ కేసులు ఎవరి మీద పెట్టాలి.. తులం బంగారం ఇస్తామని చెప్పి మోసం చేసిన ఈ చార్ సౌ బీస్‌గాని మీద కేసులు పెట్టాలి. రైతుబంధు ఎగ్గొట్టి, రుణమాఫీ చేయనందుకు రైతులు కేసులు పెట్టాలి. 2 లక్షల ఉద్యోగాలని చెప్పి.. ఇప్పటి వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వనందుకు యువత కేసులు పెట్టాలి. ఇలా అన్ని వర్గాలు పోలీసు స్టేషన్ల ముందు లైన్లు కట్టి చీటింగ్ కేసు పెడితే ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా ఈ రాష్ట్రంలో మిగలడు అని కేటీఆర్ తెలిపారు.

**పోలీసులైనా, అధికారులైనా ఎక్స్‌ట్రాలు చేస్తే..**

పోలీసులను కోరుతున్నా.. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. ఇలాంటి కిరాతక పనులు బీఆర్ఎస్ పాలనలో చేయలేదు. మంత్రినో, కంత్రినో ఫోన్ చేస్తే ఆగం కాకండి.. న్యాయం, ధర్మం ప్రకారం నడుచుకోండి. పోలీసులైనా, అధికారులైనా ఎక్స్‌ట్రాలు చేస్తే పేర్లు రాసిపెట్టి మిత్తితో సహా ఇస్తాం. రేవంత్ రెడ్డి రాజు, చక్రవర్తి కాదు. చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి లాంటి నాయకులతోనే కొట్లాడినం.. వీడెంత చిట్టినాయుడు.. గింతంత మనిషి.. వాని చూసి ఆగం కావొద్దు. ఉద్యోగులు పద్ధతి ప్రకారం ఉద్యోగం చేయండి. అతికి పోతే మా టైమ్ వచ్చాక మిత్తితో సహా ఇస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

**రైతుల మీద కేసులు పెడుతాం అంటే ఊరుకోం..**

ఇదే ఆదిలాబాద్‌లో ఖానాపూర్ చెరువు వద్ద 2 వేల ఇండ్లు కూలగొట్టేందుకు అధికారులు వెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఆ ఇండ్లకు పర్మిషన్లు, పట్టాలు ఇచ్చారు. బాధితుడు బొడిగెం గంగన్న నాలుగు తిట్లు తిట్టిండు. ఇల్లు కూలగొడితే ఎవడన్న ఊకుంటాడా..? ఆయన తిట్టిండని ఆయన మీద కేసు పెట్టారు.. జైల్లో పెడుతారట.. వంద రోజుల్లో అన్ని చేస్తానని తప్పించుకున్న లుచ్చాగాళ్ల మీద కేసులు పెట్టాల్నా.? పేదల మీద కేసులు పెట్టాల్నా..? అల్లం బెల్లం ఇస్తామని అడ్డగోలు మాటలు చెప్పి రైతులను మోసం చేస్తున్న లుచ్చాగాళ్లపై చీటింగ్ కేసులు పెట్టాలి. రైతుల మీద కేసులు పెడుతాం అంటే ఊరుకునేందుకు సిద్ధంగా లేమని కేటీఆర్ తేల్చిచెప్పారు.

# చెల్లిపై ప్రేమతో జగన్ షేర్లు బదిలీ చేశారనేది పచ్చి అబద్ధం

### – ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

అమరావతి అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన అన్న, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పై మరోసారి విరుచుకుపడ్డారు. ఆస్తుల విషయంలో కోర్టుకు వెళ్లిన జగన్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఆస్తులపై ప్రేమతో రక్త సంబంధం, అనుబంధాలు మార్చారని ఆరోపించారు. జగన్‌కు మూడు ప్రశ్నలతో కూడిన లేఖను ఆమె రాశారు. కుటుంబ విషయాలను జగన్ రోడ్డు మీదకు తీసుకువచ్చారు. అది చాలదన్నట్లు ఇప్పుడు కోర్టుల వరకు తీసుకెళ్లారని విమర్శించారు. చెల్లిపై ప్రేమతో జగన్ షేర్లు బదిలీ చేశారనేది పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. తాను చేస్తున్న ఆరోపణల వెనుక ఆస్తులను లాక్కోవడానికి కారణంగా చెబుతున్నారని, ఇది వాస్తవం కాదని స్పష్టం చేశారు. ఈడీ కేసులు బెయిల్ రద్దవుతుందని కారణాలు చెబుతున్నారని ఆరోపించారు. సరస్వతి కంపెనీ షేర్లను ఈడీ అటాచ్ చేయలేదని, వివరించారు. రూ. 32 కోట్ల విలువైన కంపెనీ భూమిని ఈడీ అటాచ్ చేసిందని వెల్లడించారు. కంపెనీ షేర్లను ఎప్పుడూ ఈడీ అటాచ్ చేయలేదని అన్నారు. ఏ సమయంలోనైనా షేర్లను బదిలీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఏ కంపెనీ ఆస్తులనైనా ఈడీ అటాచ్ చేసినా షేర్ల బదిలీని ఆపలేదని షర్మిల వివరించారు. 2016లో ఈడీ అటాచ్ చేసినందున షేర్ల బదిలీ చేయకూడదని జగన్ వాదిస్తున్నారని ఆరోపించారు.

# ‘చివరి అంచె వరకూ మెరుగైన సేవలు’ అనే అంశంపై పంచాయతీ సమ్మేళన్ సిరీస్‌లో తొలి ప్రాంతీయ వర్క్‌షాప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 24: హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ(ఎన్ఐఆర్‌డీపీఆర్)లో ‘జీవన సౌలభ్యం: చివరి అంచె వరకూ మెరుగైన సేవలు’ అనే అంశంపై కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ నిర్వహించిన పంచాయతీ సమ్మేళనంలో తొలి ప్రాంతీయ వర్క్‌షాప్ జరిగింది. పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి శ్రీ వివేక్ భరద్వాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీని సమర్థవంతమైన, పారదర్శకమైన, బాధ్యతాయుతమైన సేవల కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో ఈ పంచాయతీ సమ్మేళనం ఒక కీలక మైలురాయిని సూచిస్తుందన్న ఆయన.. గ్రామీణ స్వావలంబనకు, ప్రజలు స్వచ్ఛందంగా పన్ను చెల్లించేందుకు సేవా భావంతో సమర్థవంతమైన సేవలను అందించడం కీలకమని చెప్పారు.

నాణ్యమైన సేవలను పొందటానికి, ప్రజలు పన్నులు చెల్లించేందుకు సుముఖత వ్యక్తం చేయటానికి మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని ఆయన వివరించారు. స్వయం సమృద్ధ ఆదాయం ద్వారా పంచాయతీలు స్వావలంబన సాధించడానికి వీలు కల్పిస్తుందన్నారు. విజయవంతమైన సేవలను అందించే పద్ధతులను కాగితాల్లో పొందుపరచాలని, ఇతర పంచాయితీలకు స్ఫూర్తినిచ్చేలా వాటితో పంచుకోవాలని తెలిపారు. సేవలందించటంలో ఆదర్శంగా నిలుస్తోన్న రాష్ట్రాల్లో అనుసరిస్తున్న నమూనా ప్రక్రియలను ఇతర రాష్ట్రాల్లో అమలు చేసేందుకు వాటితో కలిసి పనిచేయాలని కోరారు. గతంలో కంప్యూటర్లు అందుబాటులో లేని వివిధ రాష్ట్రాల్లోని గ్రామ పంచాయతీలకు 22,164 కంప్యూటర్లను అందించేందుకు పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉండటం గణనీయంగా మెరుగుపడుతుంది. 3,301 గ్రామపంచాయతీ కార్యాలయాల నిర్మాణానికి కూడా మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చిందని.. ఇందులో కామన్ సర్వీస్ సెంటర్లు(సీఎస్‌సీలు) ఉంటాయని, క్షేత్రస్థాయిలో డిజిటల్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జీ. నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో సానుకూల మార్పును తీసుకురావాల్సిన బాధ్యత పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. “పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులను అత్యాధునిక పరికరాలు, సాంకేతికతో సన్నద్ధం చేయడం ద్వారా క్షేత్రస్థాయి నుంచే పరిపాలనా విప్లవానికి రంగం సిద్ధం చేస్తున్నాం” అని వ్యాఖ్యానించారు.

పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ అలోక్ ప్రేమ్ నగర్ తన ప్రారంభోపన్యాసంలో ఎన్ఐసీకు చెందిన సర్వీస్‌ప్లస్, యునిసెఫ్‌కు చెందిన రాపిడ్ ప్రోతో సహా వివిధ డిజిటల్ సదుపాయాల గురించి ప్రధానంగా ప్రస్తావించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సృజనాత్మకంగా ఉపయోగించడం, సహకార అభ్యసనపై దృష్టి సారించడం వల్ల భవిష్యత్ పంచాయతీ సమ్మేళనాల్లో జరిగే ప్రాంతీయ వర్క్‌షాప్‌లకు కొత్త ప్రామాణికతను నిర్దేశించిందని ఆయన అన్నారు. భాషిని ప్లాట్‌ఫామ్ ద్వారా హైదరాబాద్ పంచాయతీ సమ్మేళనాన్ని బెంగాలీ, ఇంగ్లీష్, గుజరాతీ, హిందీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగుతో సహా పదకొండు భాషల్లో ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని తెలియజేశారు. సమ్మిళిత పాలన, అన్ని భాషల వారికి అవసరమైన సమాచారాన్నిసమర్థవంతంగా అందించాలన్న మంత్రిత్వ శాఖ నిబద్ధతను ఇది తెలియజేస్తుందని అన్నారు.

ఈ వర్క్‌షాప్‌ను హైదరాబాద్‌లో నిర్వహించినందుకు పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖకు తెలంగాణ ప్రభుత్వ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శ్రీ లోకేష్ కుమార్ డీఎస్ కృతజ్ఞతలు తెలియజేశారు. పంచాయితీ సమ్మేళనంలో నిర్వహించనున్న నాలుగు ప్రాంతీయ వర్క్‌షాప్‌లలో ఇది మొదటిది. సృజనాత్మక విధానాలపై చర్చించడం, క్షేత్రస్థాయిలో సేవలను పెంపొందించడం కోసం అనుభవాలను పంచుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం కాగా.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మిజోరం, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని.. సేవలను అందించడంలో సవాళ్లు, అవకాశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో సేవలను అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా జీవన సౌలభ్యం అనే ఇతివృత్తంతో చర్చాగోష్ఠులను నిర్వహించారు. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్(ఎన్ఐసీ) ఆన్‌లైన్ ద్వారా సేవలను అందించేందుకు ఉపయోగపడే సర్వీస్ ప్లస్ ప్లాట్‌ఫామ్‌ను ఈ సందర్భంగా ప్రదర్శించింది. క్షేత్రస్థాయిలో కమ్యూనికేషన్, సేవలను అందించటాన్ని క్రమబద్ధీకరించడంలో కృత్రిమ మేధ, డిజిటల్ ప్రజా వేదికలకు(డీపీజీ– డిజిటల్ పబ్లిక్ గూడ్స్) ఉన్న సామర్థ్యాన్ని వాధ్వానీ ఫౌండేషన్, భాషిని, యునిసెఫ్‌లు చూపించాయి. సేవల సమర్థతను మదింపు చేయడానికి, మెరుగుపరచటానికి ఫ్రేమ్‌వర్క్‌లను అందించే.. గ్రామీణ ప్రాంతాల్లో సేవలను అందించే విషయంలో ప్రామాణికతలను నిర్ణయించటంపై ఎన్ఐఆర్‌డీపీఆర్ ఒక సెషన్ నిర్వహించింది. పంచాయితీ స్థాయిలో పరిపాలన, సేవలను అందించే య ం ( తా ం గా న్ని పెంపొందించుకునేందుకు కావాల్సిన మెరుగైన పరిజ్ఞానం, కార్యాచరణ వ్యూహాలను పంచాయతీ సమ్మేళనం అందించింది.

# ఎయిర్ ఇండియా, ఇండిగో సహా.. 80కిపైగా విమానాలకు బాంబు బెదిరింపులు

### –బాంబు బెదిరింపులతో 600 కోట్ల మేర నష్టం..!

న్యూ డిల్లీ అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దేశంలో వరుస బాంబు బెదిరింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా గత పది రోజులుగా ఎయిర్ ఇండియా సహా పలు విమానాలకు వరుస బాంబు బెదిరింపులు రావడం కలకలం సృష్టిస్తోంది. దేశ, విదేశాలకు వెళ్లే వందకుపైగా విమానాలకు ఇప్పటికే ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మరో 80కిపైగా విమానాలకు ఎమర్జెన్సీ అలర్ట్ వచ్చింది. ఇండిగో, ఎయిర్ ఇండియా, విస్తారా, ఆకాశా ఎయిర్‌లైన్స్‌కు చెందిన దాదాపు 85 విమానాలకు గురువారం బాంబు బెదిరింపులు వచ్చాయి. ఇందులో 25 ఆకాశా ఎయిర్ ఫ్లైట్స్‌కాగా, 20 ఎయిర్ ఇండియా, 20 ఇండిగో, 20 విస్తారా ఫ్లైట్స్ ఉన్నాయి. సోషల్ మీడియా ద్వారా ఈ బెదిరింపులకు పాల్పడ్డారు. అప్రమత్తమైన అధికారులు ఆయా విమానాల్లో తనిఖీలు చేపట్టారు. కాగా, గత పది రోజుల్లోనే (తాజా బెదిరింపులతో సహా) 250కిపైగా విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ఇలాంటి బెదిరింపులపై కేంద్రం తీవ్రంగా స్పందించింది. ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. నిందితులను నో ఫ్లై లిస్టులో చేర్చనున్నట్లు కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

**బాంబు బెదిరింపులతో 600 కోట్ల మేర నష్టం..!**

‘విమానంలో బాంబు పెట్టాం’ అని దుండగులు, ఆకతాయిలు పంపిస్తున్న హెచ్చరికలతో విమానాశ్రయాల్లో హైరానా నెలకొంటున్నది. ఏ విమానానికి బాంబు బెదిరింపు వచ్చినా కచ్చితంగా బాంబు థ్రెట్ అసెస్‌మెంట్ కమిటీ (బీటీఏసీ) ప్రొటోకాల్, అంతర్జాతీయ మార్గదర్శకాల ప్రకారం తనిఖీల ప్రక్రియను చేపట్టాల్సిందే. దీంతో అనేక విమానాలు ఆలస్యమవుతున్నాయి. అప్పటికే ప్రయాణంలో ఉన్న విమానాలను ఉన్నపళంగా వేర్వేరు విమానాశ్రయాలకు దారి మళ్లించాల్సి వస్తున్నది. ఫలితంగా విమానయాన సంస్థలు నష్టపోతున్నాయి. గత తొమ్మిది రోజుల్లో వచ్చిన బాంబు బెదిరింపులకు విమానయాన సంస్థలు దాదాపుగా 600 కోట్లు నష్టపోయి ఉంటాయని గతంలో ఓ విమానయాన సంస్థలో పని చేసిన ఓ అధికారి తెలిపారు. సాధారణంగా ఒక డొమెస్టిక్ విమాన సర్వీసుకు అంతరాయం కలిగితే సగటున రూ.1.5 కోట్లు నష్టం వస్తుందని, అంతర్జాతీయ విమానానికి ఇది దాదాపు రూ.3.5 కోట్ల వరకు ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి.

**కఠిన నిబంధనల తీసుకొచ్చే అవకాశం**

విమానాలకు వస్తున్న బెదిరింపులన్నీ నకిలీవే. ఇంతకుముందు అడపాదడపా ఇలాంటి బెదిరింపులు వచ్చేవి. ఇవి చాలావరకు ఆకతాయిలు చేసే పనులే అయి ఉండేవి. ఇప్పుడు మాత్రం ఒకేసారి పెద్ద ఎత్తున బెదిరింపులు వస్తుండటంతో కుట్రకోణం ఏమైనా ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటికి తోడు నవంబరు 1 నుంచి 19 వరకు ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దని ఖలిస్థానీ ఉగ్రవాది గుర్‌పత్వంత్ సింగ్ హెచ్చరించాడు. దేశంలో విమానయాన రంగానికి ఆటంకం కలిగిస్తున్న బాంబు బెదిరింపులకు అడ్డుకట్ట వేయడం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. బెదిరింపులకు పాల్పడే వారిని నో ఫ్లై లిస్టులో చేర్చి ఎప్పుడూ విమానాలు ఎక్కకుండా నిషేధించాలని విమానయాన శాఖ భావిస్తున్నది. దీంతో పాటు బెదిరింపులకు పాల్పడిన వారిని వారెంట్ లేకుండా అరెస్టు చేసేలా సప్రెషన్ ఆఫ్ అన్‌లాఫుల్ యాక్ట్స్ అగైనెస్ట్ సేఫ్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ యాక్ట్(స్వాస్కా చట్టం)–1982కు సవరణ చేయాలని నిర్ణయం తీసుకుంది.

# ఆర్టీసీ బస్సులో మహిళ మృతి..

### –ఎంజీఎంలో వైద్యం కోసం వెళ్లి తిరుగు ప్రయాణంలో మృతి

వరంగల్, అక్టోబర్ 24:ఆర్టీసీ బస్సులో మహిళ మృతి చెందిన ఘటన గురువారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని వంగపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అంకిళ్ల కవిత (36) తన భర్త కుమారస్వామి తో కలిసి గత నాలుగు రోజుల క్రితం వరంగల్ లోని ఎంజీఎం ఆసుపత్రికి వైద్యం కోసం వెళ్ళింది. గురువారం ఉదయం ఎంజీఎం ఆసుపత్రి నుండి తన స్వగ్రామానికి వెళ్ళిపోతామంటూ డాక్టర్లను కోరింది.

దాంతో అక్కడి వైద్యులు డిశ్చార్జ్ రాశారు. ఇంటికి తిరుగు ప్రయాణంలో భాగంగా ఆర్టీసీ బస్సులో ఎక్కారు. వంగపల్లి ఆర్టీసీ బస్టాప్ వద్దకు బస్సు చేరుకోగానే భర్త కుమారస్వామి సీట్లో పడుకున్న భార్య కవితను నిద్ర లేపే ప్రయత్నం చేయగా ఆమె ఎంతకీ నిద్ర నుండి లేవకపోవడంతో బస్సులోనే మృతి చెందినట్లు ప్రయాణికుల తో పాటు ఆర్టీసీ సిబ్బంది నిర్ధారణ చేశారు. వంగపల్లి బస్టాప్ వద్ద ఉన్న గ్రామస్తుల సహకారంతో ఆమె మృతదేహాన్ని ఆర్టీసీ బస్సులో నుంచి దించారు. మృతురాలికి ఒక కూతురు, ఇద్దరు కుమారులున్నారు.

# దౌల్తాబాద్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

### –పదవ తరగతి లో శత శాతం ఫలితాలు సాధించాలి.

### – జిల్లా కలెక్టర్ వెల్లూరు క్రాంతి




సంగారెడ్డి, అక్టోబర్ 24: (నేటినిజం ప్రతినిధి):ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు. ఈ ఏడాది పదవ తరగతి ఉత్తమ ఫలితాలు సాధన కోసం ఇప్పటి నుండి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యార్థులను ప్రతిభా ఆధారంగా గ్రూపులుగా విభజించి వారి సామర్థ్యాల పెంపొందించడం కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సమస్యలను ఉపాధ్యాయులు, విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్యం మనిషి ప్రాథమిక హక్కు.

### – అత్యవసర వైద్య సేవలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కీలకం .

### –నిరుపేదలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడానికి కృషి.

### – దౌల్తాబాద్ లో రూ.156 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ.



సంగారెడ్డి, అక్టోబర్ 24: (నేటినిజం ప్రతినిధి ):రాష్ట్రంలో నిరుపేద ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని దౌల్తాబాద్ గ్రామంలో రూ:156 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామాత్యులు రాజనర్సింహ, మెదక్ ఇంచార్జ్ మంత్రి, అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, టి జి ఐ సి సి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి లతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నర్సాపూర్ , దౌల్తాబాద్ ప్రాంతంలో నర్సాపూర్–సంగారెడ్డి రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరగడం వల్ల ప్రజలకు అత్యవసర వైద్యం అందించడంలోఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి దామోదర్ అన్నారు. నర్సాపూర్ – సంగారెడ్డి రోడ్ లో గతంలో అనేక ప్రమాదాలు జరగగా, అటువంటి సంఘటనలకు సత్వర వైద్యం అందించడానికి ఈ ఆరోగ్య కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి దామోదర్ అన్నారు. దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయుడానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ , వైద్యాధికారులను ఆదేశించారు.

అన్ని వర్గాల ప్రజల కు సమానంగా వైద్య ఆరోగ్య సేవలు అందించడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని, పేదవారికి ఉచిత వైద్యం అందించడంలో ఏ లోటు రాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. “ఆరోగ్యం మనిషి ప్రాథమిక హక్కు” అంటూ, ప్రజలకు సమగ్ర ఆరోగ్య సంరక్షణను అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఆరోగ్యం మాత్రమే కాదు, ఆరోగ్య విద్య, పర్యావరణం, సామాజిక ఆరోగ్యం వంటి అంశాలకు తెలంగాణ ప్రభుత్వం ప్రాముఖ్యత నిస్తుందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ ఆరోగ్యం కాపాడుతామని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి సురేఖ పేర్కొన్నారు. దౌల్తాబాద్ కేంద్రం లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి వీలైనంత త్వరగా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తామని మంత్రులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యఅధికారి గాయత్రీ ,ఆర్ డి ఓ రాజు ,తహసీల్దార్ ఫరీనా షేక్, డాక్టర్ దివ్య జ్యోతి , ప్రజాప్రతినిధులు మదన్ రెడ్డి ,అవుల రాజిరెడ్డి, రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్,తదితరులు పాల్గొన్నారు .

# మంథనిలో సైతం ఫ్రీ ఇసుక విధానాన్ని అమలు చేయాలి : పుట్ట మధుకర్

పెద్దపల్లి, అక్టోబర్ 24: పెద్దపల్లి నియోజకవర్గంలో అమలు చేస్తున్న ఫ్రీ ఇసుక విధానాన్ని మంథని నియోజకవర్గంలో అమలు చేయాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ డిమాండ్ చేశారు.

ఈ మేరకు ఆయన గురువారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు తన నియోజకవర్గంలో ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తూ ఉండటం పట్ల ఆయన ఎమ్మెల్యేని ప్రత్యేకంగా అభినందించారు.

ఇదే విధానాన్ని మంథని ఎమ్మెల్యే అమలు చేయాలని, వెంటనే జిల్లా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

# ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మరో ముగ్గురు కొత్త జడ్జిలను నియామకం

### –రాష్ట్రపతి ఆమోదం

అమరావతి అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మరో ముగ్గురు కొత్త జడ్జిలను నియమకానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి చేసిన సిఫారసు మేరకు హైకోర్టుకు ముగ్గురు అదనపు జడ్జిలను నియమించింది. ప్రస్తుతం ఏపీ హైకోర్టులోనే న్యాయవాదులుగా సేవలందిస్తున్న చల్లా గుణరంజన్, కుంచం మహేశ్వరరావు తూట చంద్ర ధనశేఖర్ ను అదనపు జడ్జిలుగా నియమించారు. రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిలతో చర్చించిన తరువాత ముగ్గురిని అదనపు జడ్జిలుగా నియమించామని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ‘ఎక్స్’ వేదిక ద్వారా ప్రకటించారు. ప్రస్తుతం ఏపీ హైకోర్టులో 26 మంది ఉండగా కొత్తగా ముగ్గురు నియామకంతో కలిపి ఈ సంఖ్య 29కు చేరుకుంది.

# అమరావతి రైల్వే అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్

అమరావతి అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి రైల్వే అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ. 2.245 కోట్లతో 57 కి.మీ కొత్త రైల్వే లైన్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గురువారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఆంధ్ర ప్రాజెక్టులకు ప్రాధాన్యత కల్పించారు. అమరావతి నుంచి హైదరాబాద్, చెన్నై), కోల్‌కత్తా కు అనుసంధానిస్తూ కొత్త రైల్వేలైన్‌ను ఏర్పాటు చేస్తామని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ రైల్వేలైన్ ద్వారా కాజీపేట మీదుగా నాగ్‌పూర్, ఢిల్లీ వరకు అమరావతికి ప్రత్యక్ష అనుసంధానం ఉంటుందని తెలిపారు. అమరలింగేశ్వర స్వామి, ధ్యానబుద్ధ, అమరావతి స్తూపం, ఉండవల్లి గుహలకు వెళ్లే వారికి సులువైన మార్గంగా రైల్వేలైన్ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ లైన్‌ద్వారా దక్షిణ, మధ్య, ఉత్తర భారత్‌తో అనుసంధానం మరింత సులువు అవుతుందని పేర్కొన్నారు. అదే విధంగా కృష్ణానదిపై 3.2 కి.మీ పొడవైన కొత్త రైల్వే వంతెన నిర్మాణం చేపడుతామని ప్రకటించారు.

# వైఎస్ జగన్‌వి శవ రాజకీయాలు : ఏపీ హోంమంత్రి అనిత



అమరావతి, అక్టోబర్ 24: వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఏపీలో శవ రాజకీయాలకు పాల్పడుతున్నారని హోంమంత్రి అనిత ఆరోపించారు. చిన్న సమస్యలను భూతద్దంలో చూయించి సానుభూతి పొందాలని చూస్తున్నారని అన్నారు. విజయనగరంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. అధికారం కోల్పోయిన బాధలో జగన్ ఏదోదో మాట్లాడుతున్నారని విమర్శించారు.

డయేరియాతో జనాలు చనిపోతున్నారని ప్రభుత్వం జగన్ చేసిన ఆరోపణలను ఖండించారు. విజయనగరం జిల్లాలో డయేరియాతో ఒక్కరే చనిపోయారని గుర్తు చేశారు. డయేరియా ప్రభలిన చోట అన్ని జలవనరుల నుంచి నీటి శాంపిళ్లు తెప్పించి పరీక్షలు జరిపిస్తున్నామని వెల్లడించారు. బాధిత ఆడవాళ్లను అడ్డం పెట్టుకుని జగన్ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు.

వైసీపీ హయాంలో డయేరియాతో చనిపోయిన బాధిత కుటుంబాలను జగన్ పరామర్శించలేదని ఆరోపించారు. వైసీపీ హయాంలో చెత్తమీద పన్ను వేశారు కానీ చెత్త తీయించలేకపోయారని పేర్కొన్నారు. ఐదేళ్లపాటు మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ కూడా చేయలేదరి అన్నారు.

కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు వచ్చిన నిధులను కూడా మళ్లించారని ఆరోపించారు. అవాస్తవాలతో జనాలను మభ్యపెడుతున్నారని అన్నారు. డయేరియా కేసులపై సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడూ సమీక్షలు చేస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారని ఆమె వివరించారు.

# టెక్స్టైల్ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యులుగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ అక్టోబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కేంద్ర టెక్స్టైల్ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యులుగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి నియమితులైనారు.

ఈ కమిటీ కి కేంద్ర టెక్స్టైల్ శాఖ మంత్రి వర్యులు గిరిరాజు సింగ్ చైర్మన్ గా ఉంటారు. లోక్ సభ నుండి ఎనిమిది మంది, రాజ్యసభ నుండి నలుగురు, అలాగే ఇద్దరు ఎక్స్ అఫిషియో సభ్యులతో మొత్తం 14 మంది సభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీలో తెలంగాణ రాష్ట్రం నుండి భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి గారికి చోటు కల్పించడం జరిగింది.

